



www.jananinadam.com

Follow :

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక



**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను,

**సంప్రదించాల్సి నెంబర్**

**9550100197,9490111460**



సంపుటి: 1 సంచిక: 281 | Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , & Hyderabad. | గురువారం 15-05- 2025 | ➤ పేజీలు : 8 | ➤ వెల : రూ.2.00




### ఉద్రిక్తతలు తగ్గేందుకు
## భారత్-పాక్ దేశాలు
# డిన్నర్ చేసుకోవాలి
### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్ : భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య కాల్పుల విరమణకు తానే కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికి రెండు దేశాలు కలిసి మంచి డిన్నర్ ఏర్పాటు చేసుకోవాలని సలహా కూడా ఇచ్చారు. అణు క్షిపణుల తో యుద్ధాలు వద్దని చెప్పారు. సౌదీ అరేబియా లో యూఎస్-సౌదీ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లో ట్రంప్ మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రంప్ తనను తాను శాంతికర్తగా అభివర్ణించుకు న్నారు. అణ్వాయుధ దేశాలైన భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తదితరులు హాజర య్యారు. భారత్-పాకిస్థాన్ మధ్య అణుయుద్ధాన్ని నివారించడానికి తన మధ్యవర్తిత్వం సాయపడిందని ట్రంప్ తెలిపారు.



### రాష్ట్రపతితో సీడీఎస్, త్రివిధ దళాధిపతుల
# సమావేశం

ఢిల్లీ : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ సహా త్రివిధ దళాధిపతులు భేటీ అయ్యారు. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను సైనిక ఉన్నతాధికారు లు రాష్ట్రపతికి సమర్పించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా త్రివిధ దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, కట్టుదిట్టమైన చర్యలను ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రశంసించారు.



### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా
## జస్టిస్ బి.ఆర్.గవాయి
# ప్రమాణస్వీకారం

2వ పేజీలో...

న్యూఢిల్లీ : భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవారు ప్రమాణస్వీకారం చేశారు. బుధవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో సిజెఐగా ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణస్వీకారం తర్వాత, సిజెఐ గవాయిని రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధాని మోడీ,లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు కేంద్ర మంత్రివర్గంలోని పలువురు అభినందించారు.

- రాహుల్‌జీ.. మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుందా?
- మిస్ వరల్డ్ పోటీదారుల కోసం మూర్ఖపు చర్య
- నిరుపేదల గుడిసెలు, షాపులు కూల్చివేయడం ఏంటి?
- బుల్డోజర్లతో పేదల ఇండ్లు కూల్చివేస్తున్నారు
- మీకు బుల్డోజర్ కంపెనీలతో రహస్య ఒప్పందం ఉందా?
- 200 కోట్ల రూపాయలకు పైగా ప్రజా ధనాన్ని వృథా ఖర్చు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు



### పేదల జీవితాలతో ఎందుకీ
# చెలగాటం!?

2వ పేజీలో...

హైదరాబాద్, మే14 : మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ వరంగల్, ములుగు జిల్లాల పర్యటనకు రానున్నారని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రజాగ్రహానికి గురిచేస్తు న్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ వర్కి ంగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించా రు. మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుల్డోజర్ కంపెనీలతో రహస్య ఒప్పందం ఉందా? అని రాహుల్ గాంధీని ఎక్స్ వేదికగా ప్రశ్నించా రు. రోజువారీ కూలి పనులు చేసుకుని జీవించే నిరుపేద ప్రజల ఇండ్లతో పాటు వారి జీవనోపాధిని నాశనం చేయడానికి నిరంతర ప్రయత్నం చేయడానికి కారణం ఏంటి ? వరంగల్‌లో కూల్చివే తలు ఎందుకు జరుగుతున్నాయని రాహుల్‌ను కేటీఆర్ ప్రశ్నించారు.



## బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర సమాచార కమిషనర్లు

హైదరాబాద్, : రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లుగా సీనియర్ జర్నలిస్టులు పీవీ శ్రీనివాస్, అయోధ్య రెడ్డి, న్యాయవాదులు దేశాల భూపాల్, మోహిసినా పర్వీన్ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో వారితో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ జి.చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, సీఎస్ కె. రామకృష్ణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆర్టీఐ కమిషనర్లకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. వీరు పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు లేదా వయసు 65 ఏళ్లు నిండే వరకు వారు రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లుగా కొనసాగుతారు.



### కల్నల్ సోఫియా ఖురేషిపై
# వ్యాఖ్యలు..
### మధ్యప్రదేశ్ మంత్రిపై కేసు నమోదుకు కోర్టు ఆదేశం

2వ పేజీలో...



### గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు..
# 48 మంది మృతి

న్యూఢిల్లీ : గాజా పై ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడింది. మంగళవారం రాత్రి వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో దాదాపు 50 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం రాత్రి, బుధవారం తెల్లవారుజామున ఉత్తర గాజాలోని ఇళ్లపై ఇజ్రాయెల్ ఫోర్స్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో కనీసం 48 మంది మరణించినట్లు జబాలియాలోని ఇండోనేషియా ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. మృతుల్లో 22 మంది చిన్నారులు కూడా ఉన్నట్లు తెలిపాయి. మరోవైపు గాజాలో యుద్ధాని ఆపడానికి ఎలాంటి మార్గం లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సౌదీ పర్యటన వేళ ఈ దాడులు జరగడం గమనార్హం.



### భారత నూతన ప్రధాన న్యాయమూర్తి గా..
# జస్టిస్ బీఆర్ గవాయ్

2వ పేజీలో...

న్యూ ఢిల్లీ, మే14 : భారత సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ (బీఆర్ గవాయ్) పదవిని అలంకరించారు. భారత ప్రధాన న్యాయమూర్తి అయిన ఆరవ మరాఠీ వ్యక్తి జస్టిస్ భూషణ్ గవాయ్. ఆయన కంటే ముందు, జస్టిస్ పి.బి. గజేంద్ర గడ్కర్, జస్టిస్ వై.వి. చంద్రచూడ్, జస్టిస్ శరద్ బాబ్డే, జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్, జస్టిస్ డి.వై. చంద్రచూడ్ సీజేఐలుగా పనిచేశారు. అంతేకాదు, నాగ్‌పూర్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి పదవిని చేపట్టిన మూడో వ్యక్తి జస్టిస్ గవాయ్. ఆయన కంటే ముందు, జస్టిస్ శరద్ బాబ్డే, జస్టిస్ ఎం. హిదయతుల్లా ఈ పదవి చేపట్టారు. నేపథ్యంలో జస్టిస్



### మహారాష్ట్ర-తెలంగాణ
## సరిహద్దుల్లో
# పులి భయం..

2వ పేజీలో...

- మహారాష్ట్రలో ఐదుగురిని చంపిన పులి
- మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దులో పులి దాడులతో తీవ్ర భయాందోళన
- తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజల్లోనూ ఆందోళన
- తునికాకు సేకరణపై ప్రభావిత ప్రాంతాల్లో తాత్కాలిక నిషేధం

హైదరాబాద్,: మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతాలు పులి భయంతో వణికిపోతున్నాయి. ఓ పెద్ద పులి మహా రాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో కేవలం నాలుగు రోజుల వ్యవధిలో ఐదుగురిని బలితీసుకోవడంతో తీవ్ర కలకలం రేగింది. ఈ జిల్లా తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు ఆనుకుని ఉండటంతో,..

జననినాదం

# భారత నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్



మహారాష్ట్రలోని అమరావతి నగరంలో భూషణ్ రామకృష్ణ గవాయ్ 1960 నవంబర్ 24న జన్మించారు. ఆయన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడైన రామకృష్ణ సూర్యభాన్(ఆర్ఎస్) గవాయ్ కుమారుడు. ఆర్ఎస్ గవాయ్ అమరావతి నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత రాజ్యసభ ఎంపీగా కూడా పనిచేశారు. కేరళ, బిహార్ గవర్నర్‌గా పనిచేశారు. ఆయన దీక్షభూమి స్మారక కమిటీ అధ్యక్షుడు కూడా. అమరావతిలో భూషణ్ గవాయ్ ప్రాథమిక విద్యను అభ్యసించారు. ముంబయిలో న్యాయవిద్యను చదివారు. 1985 మార్చి 16న బార్ కౌన్సిల్ సభ్యుడయ్యారు. 1987 వరకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి, మాజీ అడ్వకేట్ జనరల్‌తో కలిసి పనిచేశారు. గవాయ్ 1987లో బాంబే హైకోర్టులో స్వతంత్ర న్యాయవాద వృత్తిని ప్రారంభించి 1990 వరకు స్వతంత్రంగా ప్రాక్టీస్ చేశారు. తరువాత నాగ్‌పూర్‌కు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌లో ఆయన న్యాయవాద వృత్తిని కొనసాగించారు. నాగ్‌పూర్, అమరావతి మున్సిపల్ కార్పొరేషన్లకు, అలాగే అమరావతి విశ్వవిద్యాలయానికి స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేశారు . 1992 ఆగస్టు నుంచి 1993 జులై వరకు, బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌లో గవాయ్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పదవులను నిర్వహించారు. హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌కు 2000 జనవరి 17న పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆయన నియమితులయ్యారు. 2003 నవంబర్ 14న హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆ తర్వాత, 2005 నవంబర్ 12న బాంబే హైకోర్టు శాశ్వత న్యాయమూర్తి అయ్యారు గవాయ్. అక్కడ ఆయన అనేక కీలక తీర్పులు ఇచ్చారు. హైకోర్టు న్యాయమూర్తిగా 14 సంవత్సరాలు పనిచేసిన తర్వాత, 2019 మే

మొదటిపేజీ తరువాయి...

24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు గవాయ్. భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధమవుతున్న జస్టిస్ గవాయ్ ఆరు నెలల పాటు ఆ పదవిలో ఉంటారు. 2025 నవంబర్ 23న పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ గవాయ్ కీలక తీర్పులు: సుప్రీంకోర్టులో జస్టిస్ భూషణ్ గవాయ్ కీలక తీర్పులు ఇచ్చారు. 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు ధర్మాసనంలో గవాయ్ సభ్యులు. నోట్ల రద్దు కేసు గురించి జస్టిస్ గవాయ్ తీర్పు చెబుతూ.. 'భారతీయ రిజర్వ్ బ్యాంక్ చట్టంలోని సెక్షన్ 26(2) కింద ఇచ్చిన అధికారాలను ఉపయోగించి అన్ని రకాల నోట్లను నిషేధించవచ్చు. ఈ విభాగంలో ఉపయోగించిన 'ఏదైనా' అనే పదాన్ని పరిమితంగా కాకుండా విస్తృత కోణంలో అర్థం చేసుకోవాలి' అని వ్యాఖ్యానించారు. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) రిజర్వేషన్ ఫ్రేమ్‌వర్క్‌లో ఉప-వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా అనుమతించొచ్చని 2024లో సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. జస్టిస్ భూషణ్ గవాయ్ ఈ ధర్మాసనంలో భాగం. ఈ కేసులో భాగంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ నిబంధనను ప్రవేశపెట్టాలని తీర్పు చెప్పిన వారిలో జస్టిస్ గవాయ్ ఒకరు. ఈ కేసు తీర్పులో భాగంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ 'రాజ్యాంగంలో పొందుపరిచినట్లుగా ప్రతి ఒక్కరినీ సమానంగా చూసేలా ఈ దశ సహాయపడుతుంది. అయితే, ఇతర వెనుకబడిన తరగతుల(ఓబీసీలు) మాదిరిగానే షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) కోసం కూడా క్రీమీలేయర్‌ను అమలు చేయడానికి ప్రభుత్వం నిర్దిష్ట ప్రమాణాలను రూపొందించాలి. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రమాణాలు భిన్నంగా ఉండవచ్చు' అని అన్నారు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసినప్పుడు, ఆ నిర్ణయాన్ని కొందరు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, కేంద్ర ప్రభుత్వ చర్యను సమర్థిస్తూ సుప్రీంకోర్టు డిసెంబర్ 2023లో తీర్పును వెలువరించింది. ఈ తీర్పు ఇచ్చిన రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ భూషణ్ గవాయ్ కూడా ఒకరు. 'ఎలక్టోరల్ బాండ్ స్కీం' రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలోనూ గవాయ్ సభ్యులు. దాతల వివరాలు చెప్పకపోవడమనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(జీ) కింద పౌరుల సమాచార హక్కును ఉల్లంఘిస్తోందని ఈ ధర్మాసనం అభిప్రాయపడింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో నిందితుల ఇళ్ల కూల్చివేతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనానికి జస్టిస్ గవాయ్ నాయకత్వం వహించారు. కూల్చివేతలను ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది, తగిన ప్రక్రియను పాటించకుండా ఆస్తులను ధ్వంసం చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంది. నిందితుల ఇళ్లపై ఇటువంటి చర్యలు తీసుకునే ముందు అనుసరించాల్సిన విధానపరమైన చర్యలను కోర్టు నిర్దేశించింది. ఈ మార్గదర్శకాలను దేశవ్యాప్తంగా వర్తింపజేయడం జరిగింది. ఈ నియమాలను అమలు చేయడానికి తగిన సర్క్యులర్‌లను జారీ చేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను కూడా సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. రాహుల్ గాంధీ కేసు: రాహుల్ గాంధీపై దాఖలైన పరువు నష్టం కేసులో సూరత్ సెషన్స్ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, గరిష్ఠ శిక్ష విధించడానికి దిగువ కోర్టు నిర్దిష్ట కారణాలను అందించలేదని పేర్కొంటూ సుప్రీంకోర్టు శిక్షను నిలిపివేసింది. జస్టిస్ భూషణ్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ ఈ కేసును విచారించింది. అయితే, విచారణ సమయంలో జస్టిస్ గవాయ్ తన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో ఉన్న దీర్ఘకాల అనుబంధాన్ని పేర్కొంటూ స్వచ్ఛందంగా కేసు నుంచి తప్పుకునేందుకు ముందుకొచ్చారు. చివరికి, కేసును గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనమే విచారించింది. తీస్తా సెతల్వాద్, మనీష్ సిసోడియాలకు బెయిల్ : జస్టిస్ భూషణ్ గవాయ్ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం 2023లో సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు బెయిల్ మంజూరు చేసింది. 2002లో గుజరాత్ అల్లర్లకు కుట్ర పన్నారనే ఆరోపణలు తీస్తాపై ఉన్నాయి. 'లిక్కర్ స్కాం' కేసులో అరెస్టయిన దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు 2024లో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తులు భూషణ్ గవాయ్, కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ముందు సిసోడియా బెయిల్ విచారణ జరిగింది. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో, 17 నెలలు కస్టడీలో గడిపిన సిసోడియా జైలు నుంచి విడుదలయ్యారు. ప్రశాంత్ భూషణ్ కోర్టు ధిక్కార కేసు: భారత ప్రధాన న్యాయమూర్తికి సంబంధించి సోషల్ మీడియా ఎ÷-లాట్‌ఫాం 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేసి సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని సుప్రీంకోర్టు భావించింది. ఈ విషయాన్ని కోర్టు సుమోటోగా స్వీకరించింది. ఈ కేసును న్యాయమూర్తులు అరుణ్ మిశ్రా, భూషణ్ గవాయ్, కృష్ణ మురారిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రశాంత్ భూషణ్ పోస్టు కోర్టు ధిక్కారమని బెంచ్ తేల్చింది.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయి ప్రమాణస్వీకారం



మొదటిపేజీ తరువాయి...

ఈ కార్యక్రమానికి మాజీ చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా హాజరయ్యా రు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ గవాయికి శుభాకాంక్షలు తెలిపారు. సిజెఐగా జస్టిస్ గవాయి ఆరునెలల పాటు పదవిలో కొనసాగుతారు. ఈ ఏడాది నవంబర్‌లో ఆయన పదవీవిరమణ చేయనున్నారు. బాంబే హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన ఆయన 1985లో బార్‌లో చేరారు. 2003లో బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2005లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

## ఉద్రిక్తతలు తగ్గేందుకు భారత్-పాక్ దేశాలు డిన్నర్ చేసుకోవాలి

మొదటిపేజీ తరువాయి...

అది లక్షలాది ప్రాణాలను కాపాడిందని అన్నారు. ఉద్రిక్తతలు మరింత తగ్గేందుకు భారత్, పాకిస్థాన్ దేశాలు మంచి డిన్నర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 'ఇరుదేశాల మధ్య శాంతి ప్రక్రియలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియోలు పాలుపంచుకున్నారు. ఇరు దేశాల పరిస్థితి బాగుందని అనుకుంటున్నా. వాళ్లని మనం ఒకచోట చేర్చవచ్చు. మార్కో రూబియో, వాళ్లు కలిసి బయటకు వెళ్లి మంచి విందు చేసుకోవచ్చు. ఇది బాగుంటుంది కదా?' అని ట్రంప్ ఫోరమ్‌లో వ్యాఖ్యానించారు. 'కొన్ని రోజుల క్రితమే భారత్-పాకిస్థాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించడానికి చరిత్రక కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలుచేయడంలో మా యంత్రాంగం విజయవంతమైంది. ఈ విషయంలో నేను వాణిజ్య అంశాలను ఎక్కువగా ఉపయోగించాను. సహచరులారా రండి. ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుందాం. వ్యాపారం చేద్దాం. అణు క్షిపణుల వాణిజ్యం చేయొద్దు. అందరికీ ఆనందం కలిగేలా చేద్దాం. భారత్-పాక్ పాలకులు శక్తిమంతమైన, ఉత్తమ, తెలివైన నేతలు. యుద్ధం నిలిచిపోయింది. ఇది అలాగే కొనసాగాలని ఆశిద్దాం' అని ట్రంప్ అన్నారు. ఈ సందర్భంగా ఆహూతులంతా చప్పట్లతో ట్రంప్‌ను అభినందించారు. అయితే కాల్పుల విరమణ విషయంలో మూడోపక్షం మధ్యవర్తిత్వాన్ని భారత్ తిరస్కరిస్తోంది. భారత్, పాకిస్థాన్‌లకు చెందిన డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవోలు) తమంతట తాము అవగాహనకు వచ్చారని, ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయం లేదని భారత ప్రభుత్వ వర్గాలు స్పష్టంచేశాయి. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ మళ్లీమళ్లీ చెప్పుకుంటుండటం గమనార్హం.

# బంగ్లా యువతితో పాక్ హై కమిషనర్ శృంగార లీలలు



ఇస్లామాబాద్ - ఇండియాలో ఉగ్రదాడులకు పాల్పడి భారత్ చేతిలో చావుదెబ్బ తిన్న పాకిస్థాన్ మరో వివాదంలో చిక్కుకుంది. బంగ్లాదేశ్‌లో పాకిస్థాన్ హైకమిషనర్‌గా వ్యవహరిస్తున్న సయ్యద్ అహ్మద్ మరూఫ్ వివాదం లో చిక్కుకున్నాడు. ఓ బంగ్లాదేశీ అమ్మాయితో ప్రైవేటుగా గడిపిన ఆయన అశ్లీల వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే సయ్యద్ అహ్మద్ హనీట్రాప్‌లో చిక్కుకున్నారన్న వార్తలు గుప్పుమనడంతో పాకిస్థాన్ అప్రమత్తమైంది. ఆయనను సెలవుపై వెళ్లాల్సిందిగా ఆదేశించింది.

అయితే ఈ వివాదం బయటకు రాగానే అహ్మద్ మరూఫ్ మే 11న ఢాకా విడిచి వెళ్లిపోయినట్లు బంగ్లా మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆయన దుబాయ్ మీదుగా ఇస్లామాబాద్ చేరుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయమై బంగ్లాదేశ్ విదేశాంగ శాఖకు పాకిస్థాన్ హై కమిషన్ అధికారికంగా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. మరూఫ్ స్థానంలో పాక్ డిప్యూటీ హైకమిషనర్ ఆసిఫ్ తాత్కాలికంగా హైకమిషనర్ బాధ్యతలు చేపట్టారు. కాగా, మరూఫ్‌కు సంబంధించిన కొన్ని వీడియోలు ఇటీవల నెట్టింట ప్రత్యక్షమయ్యాయి. ఓ బంగ్లాదేశీ యువతితో అతడు క్లోజ్ గా ఉన్న ఫొటోలు, వీడియోలు తెగ వైరల్ అయ్యాయి. ఆమెతో పాక్ దౌత్యవేత్తకు సన్నిహిత అనుబంధం ఉందని తెలుస్తుంది. ఆయన ఆ యువతి వలపు వలలో చిక్కుకున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఇప్పటికే సున్నితమైన నిఘా సమాచారాన్ని మరూఫ్ సదరు యువతికి చేరవేసి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పాకిస్థాన్ సమగ్ర విచారణకు ఆదేశించింది.

## పేదల జీవితాలతో ఎందుకీ చెలగాటం!?

మొదటిపేజీ తరువాయి...




ఈరోజు (మే 14న) మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించే మార్గాన్ని 'అందం'గా చేయడానికి అని ప్రజలకు చెబుతున్నారు. అలాంటి చర్యలు చేస్తున్న మీ కాంగ్రెస్ నేతలు మీది ప్రజా పాలన అని, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడానికి సిగ్గుపడాలంటూ ఘాటుగా స్పందించారు. రాజభవనాలలో విలాసవంతమైన విందులు, మరోవైపు 200 కోట్ల రూపాయలకు పైగా ప్రజా ధనాన్ని వృథా ఖర్చు చేశారు. బుల్డోజర్లతో పేదల ఇండ్లు కూల్చివేస్తున్నారు. పేదల జీవితాలను బుల్డోజర్ల కింద ఎందుకు నలిపేయాల్సి వచ్చింది?. మీ సిగ్గులేని కాంగ్రెస్ ప్రభుత్వం మేం అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేటీఆర్ షేర్ చేసిన వీడియోలో ఏముందంటే.. రోడ్డు పక్కన ఉన్న పేదల గుడిసెలు, వారి చిన్న చిన్న షాపులను సిబ్బంది తొలగిస్తున్నారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ లో పాల్గొనే అందెగత్తెలు నేడు వరంగల్ జిల్లాకు రానున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వెయ్యి స్తంభాల గుడి, రామప్ప టెంపుల్ లాంటి ప్రముఖ కట్టడాలను వారు సందర్శించనున్నారు. దాంతో తమ లాంటి పేదలకు నష్టం కలిగించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. వారెవరో విదేశాల నుంచి అందగత్తెలు వస్తే మాకు అన్యాయం ఎందుకు చేస్తున్నారు. మా పొట్ట ఎందుకు కొడుతున్నారు. కాంగ్రెస్ కు ఓట్లు వేసింది మేమా, లేక మిస్ వరల్డ్ అందెగత్తెలు వచ్చి ఓట్లు వేశారా అని కొందరు పేదలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## బుడమేరు గండ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ఇబ్రహీం పట్నం: గత బుడమేరు వరదకు గండ్లు పడిన ప్రాంతాలను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. గతంలో అత్యవసరంగా పూడ్చిన 3 గండ్లు కలిపి రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం పనులు మొదలు పెట్టబోతున్నాం. సీజన్ మొదలయ్యేలోగా 3 గండ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ బుడమేరు డైవర్షన్ కెనాల్ ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా, పెండింగ్ పనులు పూర్తి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. బుడమేరు వరద, ఎనికేపాడు మీదుగా కొల్లేరు, ఉప్పుటేరు నుండి సముద్రంలో కలిసేలా, డీపీఆర్ తయారీ దశలో ఉంది. బుడమేరు ఓల్డ్ ఛానెల్ కు సమాంతరంగా, మరొక కొత్త ఛానెల్ ను కూడా 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. బుడమేరు వరదల నియంత్రణకు డిజాస్టర్ మానేజ్మెంట్ కింద, కేంద్రం సహకారం తో ముందుకు వెళ్ళేలా ప్రపోజల్స్ తయారు చేసాం. మున్సిపల్, రెవెన్యూ, డిజాస్టర్ మానేజ్మెంట్ శాఖలు సమన్వయం చేసి ప్రతిపాదన ముఖ్యమంత్రి ముందు ఉంచుతామని అన్నారు.

## ఝాన్సీ కంటోన్మెంట్ ఆర్మీ జాయింట్ కమాండ్ ఆఫీసర్ గా మెట్ పల్లి వాసి






మెట్ పల్లి మే 14: మెట్ పల్లి పట్టణానికి చెందిన ఆకుల లక్ష్మీ-నర్సయ్య దంపతుల పెద్ద కుమారుడు అయిన ఆకుల ఆనంద్ 2005 వ సంవత్సరంలో ఆర్మీలో చేరి గత ఇరవై సంవత్సరాలలో అంబాలా, ఢిల్లీ, జమ్మూకాశ్మీర్, ఝాన్సీ, హర్యానా, చండీగఢ్, లేహ్, లద్దాక్, ఝాన్సీలో వివిధ హోదాలలో పనిచేశారు. ఇందుకుగా ను బుధవారం రోజున ఝాన్సీ ఆర్మీ కంటోన్మెంట్ జూనియర్ కమాండ్ ఆఫీసర్ గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అంతేగాక, మన ప్రాంత వాసి ఆర్మీలో ఉన్నత స్థానం పొందటం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఒక సామాన్య రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి కష్టపడి ఈ స్థాయికి రావడం ఎంతో గొప్ప విషయమని ఇలాంటి వారిని చూసి స్థానిక యువకులు ఆదర్శంగా తీసుకుని దేశసేవకు ముందుకు రావాలని పలువురు పిలుపునిచ్చారు. ఇక వీరి కుటుంబ విషయానికి వస్తే తల్లిదండ్రులు ఆకుల లక్ష్మీ-నర్సయ్య మామూలు రైతు కుటుంబానికి చెంది, నిరాక్షరాస్యులు అయినప్పటికీ వారి సంతానాన్ని ఎంతో కష్టపడి చదివించారు. వీరి కూతురు ఆకుల మంజుల గవర్నమెంట్ టీచర్ గా, పెద్ద కుమారుడు ఆనంద్ ఆర్మీ ఆఫీసర్, చిన్న కుమారుడు ఆకుల ప్రవీణ్ అడ్వకేట్ గా పనిచేస్తున్నారు. కష్టపడి పిల్లలను ఈ స్థాయికి తీసుకువచ్చిన వారి తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

# మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దుల్లో పులి భయం..

మొదటిపేజీ తరువాయి...

ఆ పులి తమ ప్రాంతంలోని అడవుల్లోకి ప్రవేశిస్తుందేమోనని అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. సోమవారం నాడు మూల్ తాలూకాలోని బడురానా గ్రామానికి చెందిన భూమికా బెండేర్ (28) అనే మహిళ పులి దాడిలో మరణించడం ఈ భయాలను మరింత తీవ్రతరం చేసింది. తన భర్త, కుటుంబ సభ్యులతో కలిసి అటవీ ఫలసాయమైన తునికాకు సేకరణకు వెళ్లినప్పుడు ఈ ఘోరం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, వారు ఆకు సేకరిస్తుండగా పులి అకస్మాత్తుగా దాడి చేసింది. తప్పించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ, భూమికా పులి పంజాకు చిక్కి ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మూల్ పట్టణానికి తరలించారు. ఈ పులి సాగిస్తున్న మారణకాండ మే 10వ తేదీన ప్రారంభమైంది. మెండమాలా గ్రామానికి చెందిన కాంత చౌదరి (65), శుభాంగి చౌదరి (28), రేఖాషిండే (51) అనే ముగ్గురు కూలీలు తునికాకు సేకరణకు వెళ్లి, చర్గావ్ అటవీ ప్రాంతంలోని ఓ చెరువు సమీపంలో విగతజీవులుగా కన్పించారు. ఆ మరుసటి రోజే, నాగోడా గ్రామానికి చెందిన విమలా షిండే (64) మరో దాడిలో పులికి బలయ్యారు. ఈ వరుస ఘటనలతో చంద్రపూర్, బల్లార్షా జిల్లాలతో పాటు తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాసులు కూడా తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

అటవీశాఖ చర్యలు: ఈ దాడుల నేపథ్యంలో మహారాష్ట్ర అటవీశాఖ అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో తునికాకు సేకరణను



తాత్కాలికంగా నిషేధించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం అవసరమని భావించినప్పటికీ, ఇది అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించే గిరిజ నులసీజనల్ ఆదాయంపై తీవ్రప్రభావంచూపుతోంది. పులిని గుర్తించి, బంధించే వరకు అటవీ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని అధికారులు స్థానికు లకు విజ్ఞప్తి చేశారు. పులి జాడ కనిపెట్టేందుకు అదనపు సిబ్బందిని మోహరించి, గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఆవాసం కోల్పోవడం లేదా గాయపడటం వల్ల పులి ఈ విధంగా దూకుడుగా ప్రవర్తిస్తుండవచ్చని వన్యప్రాణి నిపుణులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ దాడుల ఘటన అటవీ సరిహద్దు గ్రామాల్లో మానవ-వన్యప్రాణి సంఘర్షణ సమస్యను మరోసారి తెరపైకి తెచ్చింది. అటవీ ఉత్పత్తులపై ఆధారపడే గిరిజన కార్మికులకు మెరుగైన రక్షణ కల్పించాలని, పర్యవేక్షణను పటిష్టం చేయాలని, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# కల్నల్ సోఫియా ఖురేషిపై వ్యాఖ్యలు..

మొదటిపేజీ తరువాయి...

భోపాల్: మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి విజయ్ షా కల్నల్ సోఫియా ఖురేషిపై చేసిన అవమానకర, మతపరమైన, లైంగిక వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించింది. మంత్రి విజయ్ షాపై కేసు నమోదు చేయాలని రాష్ట్ర పోలీస్ చీఫ్‌ను ఆదేశించింది. పహల్గామ్ ఉగ్ర దాడికి ప్రతీకరంగా భారత్ సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీతో కలిసి మీడియాకు బ్రీఫింగ్ ఇచ్చారు. పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన సైనిక చర్యల గురించి వివరించారు. కాగా, మధ్యప్రదేశ్ గిరిజన వ్యవహారాల మంత్రి విజయ్ షా, మంగళవారం మోవ్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కల్నల్ సోఫియా ఖురేషి నుద్దేశించి వ్యాఖ్యలు చేశారు. 'వారు (ఉగ్రవాదులు) హిందువుల బట్టలు విప్పి చంపారు. వారి సోదరిని మోదీ పంపారు. మేం వారి బట్టలు విప్పలేకపోయాం. కాబట్టి వారి మతానికి చెందిన ఒక కుమార్తెను పంపాం. మా సంఘంలోని సోదరీమణులను మీరు వితంతువులు చేశారు. కాబట్టి మీ సంఘంలోని ఒక సోదరి మిమ్మల్ని వివస్త్రను చేస్తుంది. ప్రతీకారం తీర్చుకోవడానికి మీ మతం కుమార్తెలను పాకిస్థాన్‌పైకి పంపవచ్చని మోదీ నిరూపించారు' అని అన్నారు. మరోవైపు మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి విజయ్ షా చేసిన ఈ వ్యాఖ్యలపై మజీ సైనిక అధికారులతోపాటు ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. అయితే తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని విజయ్ షా తెలిపారు. ఎవరైనా తప్పుగా భావిస్తే ఒకసారి కాదు పదిసార్లు క్షమాపణ చెబుతానని అన్నారు.

# అగ్నిప్రతిష్టతో ఆరంభం.. తీర్థ గోష్టితో ముగింపు



- పాలచెట్టు 'పంచముఖి' రజతోత్సవాల్లో ప్రతిదీ ఆలకింప జేసేదే
- పిడకల నుండి ఆవు నెయ్యి దాకా అన్నింటా నాణ్యత ప్రమాణాలు
- దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రధాన అర్చకులు కలప్ప చైతన్య చార్యులు
- 21న విచ్చేస్తున్న శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి14:** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని పాలచెట్టు పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో రజతోత్సవ వేడుకలు దగ్గర పడుతున్నాయి. ఈ నెల 17న సాయంత్రం మొదలయ్యే మహోత్సవాలు ఐదు రోజుల పాటు దేదీప్యమానంగా జరుగనున్నాయి. 17వ తేదీన సాయంత్రం శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి మందమర్రి పట్టణానికి విచ్చేయనున్నారు. ఆ సందర్భంగా జీయర్ స్వామికి పూర్ణకుంభం స్వాగతం పలుకుతారు. అనంతరం పట్టణ పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తారు. శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో అలంకరించి హనుమాన్ దీక్ష స్వాముల ఆధ్యాత్మిక నఅత్యాల మధ్య ఊరేగింపు జరుపుతారు. శోభాయాత్ర అనంతరం భగవదనుజ్ఞ, సభాప్రార్థన, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనం, రక్షా బంధనం, ఋత్విగ్వరణ, మఅత్సంగ్రహణ, అంకురార్పణ, హవనం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



**అగ్నిప్రతిష్టతో ఆరంభం...**

18వ తేదీ ఆదివారం యదావిధి సుప్రభాత సేవ, ప్రాతరారాధన, సేవాకాలం, బాలభోగనివేదన, శాత్తుముర్రై కార్యక్రమాల అనంతరం ప్రతిష్టాత్మక అగ్ని ప్రతిష్ట హోమం జరపనున్నారు. దీంతో పాటు వేద విన్నపములు, శ్రీ రామాయణ హవనం చేపడతారు. ముఖ్యంగా సకలవిధ నక్షత్ర, గ్రహ దోష నివారణ కొరకు నక్షత్రేష్టి, ప్రాయశ్చిత్త హవనములు, పూర్ణాహుతి తీర్థ ప్రసాద గోష్టి ఉంటుంది. ఇక సాయం సణయాన.. మళ్ళీ పూజా కార్యక్రమాలు, హోమం, యజ్ఞాలు ప్రారంభమవుతాయి. సాముహిక శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహిస్తారు. తదనంతరం శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి వారికి లక్ష తమలపాకులతో అర్చన గావిస్తారు.

అనంతరం హరికథ కాలక్షేపం, పంచసూక్త పరివార ప్రాయశ్చిత్త హవనములు ఉంటాయి.

**శ్రీ సుదర్శన, నారసింహ ఇష్టి...**

రజతోత్సవాల్లో భాగంగా 19వ తేదీ సోమవారం ఉదయం వివిధ పూజల అనంతరం శ్రీ సుదర్శన, నారసింహ ఇష్టి అర్చనలు జరుపుతారు. సర్వవిధ ఋణ, రోగ, భయ, శత్రు నివారణ నిమిత్తం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హోమం ఇది. ఈ ఇష్టి పూర్తయిన తర్వాత జీయర్ స్వామిచే ప్రవచనం ఉంటుంది. ప్రవచనం అయిపోగానే సంగాపు తిలగవతి బఅందం చేత నృత్య ప్రదర్శన జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తిలగవతి బఅందం ఇందు కోసం ప్రత్యేకంగా వైజాగ్ నుండి వస్తున్నారు. ఇక 20వ తేదీ మంగళవారం ఉదయం సంక్షేప రామాయణ, మన్యుసూక్త హవనములు, నిత్య పూర్ణాహుతి నిర్వహిస్తారు. సాయంత్రం భద్రాద్రి శ్రీ రామచంద్రుని స్థానాచార్యులు శ్రీమాన్ ఉ.వే కోమాండూరి ఇళ్ళైవిల్లి స్థలశాయి శ్రీనివాస ఆచార్యుల చేత హనుమద్వైభవ ప్రవచనాలు ఉంటాయి.

**21న శ్రీ రామ పాదుకా పట్టాభిషేకం...**

ప్రతిష్టాత్మక రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 21వ తేదీన ఉదయం వేద విన్నపముల అనంతరం శ్రీ రామాయణ హవనం.. మాలమూర్తి ఆంజనేయ స్వామి వారికి అష్టోత్తర శత ఘటాభిషేకం -(108) నిర్వహించనున్నారు. అదేవిధంగా అదే రోజు సాయంత్రం శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారికి పూర్ణకుంభ స్వాగతం పలుకుతారు. అనంతరం తాపత్రయములను తొలగించి, సకల సంపదలను, భగవత్ అనుగ్రహాన్ని అందించే సాముహిక శ్రీ రామ పాదుకా పట్టాభిషేకం వేలాది మంది భక్తుల మధ్య జరుపుతారు. చిట్ట చివరి రోజైన 22వ తేదీ గురువారం నాడు హనుమజ్జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. సాయంత్రం మహా పూర్ణాహుతి, కుంభయాత్ర, మహకుంభ సంప్రోక్షణ, శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం జరిపిస్తారు. రజతోత్సవాలను పురస్కరించుకుని ప్రతి రోజూ విశేష పూజలతో పాటు సాంస్కఅతిక కార్యక్రమాలు జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా ప్రతి రోజూ తదీయారాదన(అన్నదానం) నిర్వహించనున్నారు.

## ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేసిన సిఐ,ఎస్ఐ



**జననినాదం జైనూర్,మే 14:** మండలంలోని ఊషాగం పోచం లోద్ధి,జంగావ్ ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం జైనూరు సిఐ రమేష్,ఎస్ఐ రవికుమార్ లు పోలీసుల ఆధ్వర్యంలో వేరువేరుగా వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. వాహనాల పత్రాలు వాహన దారుల డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా వాహనాలు నడపకూడదని రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని సిఐ రమేష్ ఎస్సై రవికుమార్ కోరారు. ఈ తనిఖీ లో పోలీసులు పాల్గొన్నారు.

## వీరాసత్ కోసం దరఖాస్తులు చేసుకోండి

తాసిల్దార్ ఆడ బిర్షవ్

**జననినాదం జైనూర్, మే 14:** మండలంలో అటవీ హక్కు పట్టాల (ఆర్ ఓ ఎఫ్ ఆర్ ) గల రైతులు ఎవరైనా చనిపోతే ఆ భూమి వారి కుటుంబ సభ్యులకు విరాసత్ చేయడం జరుగుతుందని జైనూర్ తాసిల్దార్ ఆడబీర్షావ్ తెలిపారు. అలా ఎవరైనా పట్టాదారు రైతులు చనిపోతే కుటుంబ సభ్యుల పేరిట పట్టాలు పొందేందుకు దరఖాస్తు ఫారం తో పాటు ఆధార్ కార్డు పట్టా పాస్ జిరాక్సు నాలుగు ఫోటోలు, తీసుకువచ్చి తాసిల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని ఆయన కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే వివరాల కోసం కార్యాలయం సంప్రదించాలని తాసిల్దార్ ఆడబీర్షావ్ కోరారు.

## నేడు అంతర్జాతీయ కుంటుబ దినోత్సవం




జననినాదం,సిర్పూర్(యు)14: ప్రతి ఏట మే 15న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం నిర్వహిస్తారు. నేటికా లంలో సమాజంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న ఈ నేపథ్యం లో కుటుంబాల విలువలను తెలియజేయడంకోసం ఈ కుటుంబ దినోత్సవం నిర్వహించబడుతుంది. గతంలో మాదిరిగా ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు ఉండడంలేదు. ఈ పరిణామం వల్ల ఒంటరితనం పెరిగిపోయి వ్యసనాలకు బానిసలు కావడం, పట్టించుకునేవారు లేకపోవడంతో మహిళలపై పనిభారం పెరిగి వారి ఆరోగ్యం దెబ్బతిన డం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. కుటుంబ వ్యవస్థ బలహీనమ వ్వడం మూలంగా సమాజంలో జరిగే దుష్పరిణామాలు గ్రహించిన ఐక్యరాజ్య సమితి కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయడంకోసం 1993, మే 15న అంతర్జాతీయ కుంటుబ దినోత్సవం ప్రారంభించింది.

# తాత్కాలిక బస్ షెల్టర్ ఏర్పాటుకు అధికారుల యోచన



**పాత సులబ్ కాంప్లెక్స్ ను పరిశీలించిన అధికారులు**

**జననినాదం,జైనూర్,మే 14:** మండల కేంద్రంలో బస్టాండు లేక ప్రజలు ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారులు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ సమీపంలో పాత సులబ్ కాంప్లెక్స్ అసంపూర్తిగా ఉండడంతో దానిని తాత్కాలిక బస్ షెల్టర్ గా మారిస్తే ప్రయాణికులకు ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని అధికారులు భావించి బుధవారం గతంలో నిర్మించి అసౌకర్యంగా ఉన్న సులభ కాంప్లెక్స్ గదులను అ ది . క ా ం ి ౦ ల ౦ పరిశీలించారు. మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రజల కోసం నూతనంగా మరుగుదొడ్ల కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేయిస్తున్నారు. సులబ్ కాంప్లెక్స్ ల పనులు చురుకుగా జరుగుతున్నాయి. దాని ముందరనే బస్ షెల్టర్ ఏర్పాటు జరిగితే బాగుంటుందని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తాసిల్దార్ ఆడ బీర్షావ్, జైనూర్ ఎస్సై రవికుమార్, జైనూర్ మేజర్ గ్రామ పంచాయతీ ఈవో కురుశంగ ఆనందరావు, ఈజీఎస్ ఏపీవో నగేష్ పంచాయతీ కార్యదర్శి భరత్ సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షులు మడావి భీంరావ్ పరిశీలించారు. గతంలో సులబ్ కాంప్లెక్స్ గా అసంపూర్తిగా ఉన్న దానిని మినీ బస్టాండ్ ల ఏర్పాటు చేయుటకు జిల్లా అధికారుల అనుమతి తీసుకుంటామని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తాసిల్దార్ ఆడ బిర్షావ్ తెలిపారు. తాత్కాలిక మినీ బస్టాండ్ ఏర్పాటు చేసే కొంతమేరకు ప్రజలకు ప్రయాణికులకు ఇబ్బందులు తొలుగుతాయని నాయకులు ప్రజలు పేర్కొంటున్నారు.

**అపచారం.. మంత్రుల కాళ్ల వద్ద సరస్వతీ దేవి ఫొటో.. పుష్కర భక్తుల ఆగ్రహం**



మహాదేవపూర్(కాళేశ్వరం), మే 14: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు మరికొన్ని గంటల్లో ప్రారంభంకా నున్నారు. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారుల ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు వివాదానికి దారితీశాయి. ఈనెల 15 నుంచి కాళేశ్వరంలో ప్రారంభమయ్యే సరస్వతీ పుష్కరాల పండుగ సందర్భం గా స్థానిక దేవాదాయశాఖ అధికారులు అత్యుత్సాహం అపచారంగా మారింది. పుష్కరాల ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు స్వాగతం పలుకుతూ కాలేశ్వరం బస్టాండ్, పరిసరాల వద్ద ఏర్పాటుచేసిన కటౌట్ పలు విమర్శలకు తావిస్తున్నది. ఆ కటౌట్ లో.. ప్రముఖుల పాదాల కింద సరస్వతీ దేవి చిత్రపటం పెట్టడం పట్ల పుష్కర భక్తులు చివాట్లు పెడుతున్నారు. ఆలయ అధికారులకు ఏమాత్రం ధర్మబక్తి ఉండదా అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. చదువుల తల్లి.. సాక్షాత్తు సరస్వతి దేవి పుష్కరాలు జరుగుతున్న వేళ ఇలాంటి అపచారం మంచిది కాదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని భక్తులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్జీ-1 ఏరియాలో "మెగా జాబ్ మేళా"




గోదావరి ఖని:గోదావరిఖని మరియు పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశములు కల్పించుటకు తెలంగాణా రాష్ట్ర డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాను సారం - సింగరేణి సి,ఎం.డి ఎన్. బలరాం ఐ ఆర్ ఎస్ సూచనల మేరకు రామగుండం ఏరియా1లో తేది. 18.05.2025, ఆదివారం రోజున "మెగా జాబ్ మేళా" నిర్వహణ కొరకు ఆర్జి.1 జియం శ్రీ లలిత్ కుమార్ గారి సారధ్యంలో అధికారుల బృందం కమ్యూనిటి హాలు మరియు జవహార్ లాల నెహ్రూ స్టేడియం నందు స్థల పరిశీలన చేసి బస్టాండ్ కు మరియు మెయిన్ రోడ్ కు దగ్గర ఉన్నందున కమ్యూనిటీ హాల్ ను ఎంపిక చేయడం జరిగినది. ఈ మెగా జాబ్ మేళా తేదీ 18.05.2025 రోజున గోదావరిఖని కమ్యూనిటీ హాల్ నందు పెద్ద ఎత్తున నిర్వహించుటకు తగిన ఏర్పాట్లు చేయాలనీ ఇందులో 100 కంపెనీలు రానున్నాయని ఈ మెగా జాబ్ మేళాలో రామగుండం 1,2,3 ఏరియాలు మరియు పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుండి సుమారు 10 వేల మంది నిరుద్యోగ యువతి యువకులు పాల్గొంటారని వారికి సరిపడు షామియానాలు, చల్లదనం కొరకు కూలర్స్, త్రాగు నీరు, హెల్ప్ డెస్క్ కౌంటర్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఇంటర్వ్యూల కొరకు ప్రత్యేక సెల్స్ వచ్చే కంపెనీల వారికి ప్రత్యేక వసతి, తెలంగాణ రాష్ట్ర మంత్రులు, అత్యున్నత అధికారులకు సరిపడు స్టేజి ఏర్పాట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశిం చారు. ఇట్టి కార్యక్రమం విజయవంతం చేయడంలో అధికారులు తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని, అన్ని గనుల సంక్షేమాధికారులు పెద్ద ఎత్తున ఉద్యోగుల పిల్లలు పాల్గొనేల చూడాలని తెలిపారు మరియు వివిధ డిపార్ట్ మెంట్ల ఉన్నతాధికారులు వారికి నిర్దేశించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారి చేసారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జిఎం గోపాల్ సింగ్, డిజియం పర్సనల్ కిరణ్ బాబు, ఎన్విరాన్ మెంట్ డిజియం ఆంజనేయ ప్రసాద్, డిజీ.ఎం వర్క్ షాప్ జితేందర్ సింగ్, డిజియం వరప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, అధికారులు డెనిల్ కుమార్, వీరారెడ్డి, మరియు నాయకులు రంగు శ్రీనివాస్, పొలసాని శ్రీనివాస్, మహంకాళీ స్వామీ, దీటి బాలరాజు గట్ల రమేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం చేసిన చొప్పదండి శాసన సభ్యులు



కొడిమ్యాల,మే 13: కొడిమ్యాల మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గుండు మల్లయ్య కు రెండు కళ్ళు లేకపోవడంతో మాజీ సహకారబ్యాంక్ ఛైర్మెన్ గుడి మల్లికార్జున్ రెడ్డి చొప్పదండి శాసన సభ్యులుమేడిపల్లి సత్యం దృష్టికి తీసుకుపోగా ఎమ్మెల్యే స్పందించి 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరి నారాయణ గౌడ్, తాజా మాజీ ఉపసర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు కోలాపురం రమేశ్, తదితరులు ముమ్మాడి స్వామి, కంచర్ల రవీందర్, మహంకాళి గంగరాజాం,తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యం తోనే అద్భుత విజయాలు

**సైకాలజిస్ట్ అధ్యక్షుడు ఎజ్రా మల్లేశం**




రామడుగు : రామడుగు మండల కేంద్రంలోని బేరాక చర్చిలో వాల్ ఆఫ్ బెరాక మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విశ్వ ప్రగామి ఫౌండేషన్ వారు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా జిల్లా సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎజ్రా మల్లేశం మాట్లాడుతూ సంపూర్ణమైన ఆరోగ్యాన్ని కలిగినప్పుడే జీవితంలో ఎన్నో అద్భుత విజయాలు సాధించవచ్చని వారన్నారు. విశ్వ ప్రగామి ఫౌండేషన్ వారు హాజరై ఆయన మాట్లాడుతూ మనిషి శరీరముగా మానసికంగా సామాజికంగా ఆధ్యాత్మికంగా ఆర్థికంగా బాగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా పరిగణించబడుతుందని అన్నారు. మానసిక ఆరోగ్యం మనిషికి మనోధైర్యాన్ని సంపూర్ణమైన అవగాహనతో ముందుకు పోయే విధంగా సహకరిస్తుందని అన్నారు. పెరటి తోట చెట్ల గురించి సంస్థ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ అవగాహన కలిగించారు. అనంతరం పెరటి మొక్కల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ అబ్రహాము తదితరులు పాల్గొన్నారు.





# ఏజెన్సీలో అడ్డగోలుగా.. మద్యం దందా

- ఎక్కడపడితే అక్కడ...తాగినోడుకి తాగినంత..
- కిరాణా షాపుల్లోనూ కావాల్సిన బ్రాండ్లు..
- ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు..
- చోద్యం చూస్తున్న అధికారులు..
- బెల్టు షాపులను అరికట్టండి...
- నిబంధనలు పాటించని దుకాణాలను నియంత్రించండి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే14: ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గం లోమద్యం మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని, లక్షల్లో మద్యాన్ని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు అక్రమంగా కోట్ల రూపాయలకుపడగలెత్తేందుకు మాఫియాకు తెరలేపారని, ఎమ్మార్పీ కంటే అధిక ధరలతో అడ్డగోలుగా దందా చేస్తున్నారని, సామాజిక సేవకులు కర్నే బాబురావు ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో మద్యం షాపుల వ్యాపారులు సిండికేట్ తో విచ్చలవిడి అమ్మకాలకు తెర లేపారన్నారు.అధికారుల కనుసన్నల్లోనే 24 గంటల పాటు బెల్ట్ షాపులలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ఓవైపు ప్రభుత్వ వైన్ షాపులలో మరో వైపు బెల్ట్ షాపులలో అధిక రేట్లకు మద్యం విక్రయాలు జరుగుతున్నా, ఎక్సైజు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు చేపట్టక పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అధిక ధరలపై మద్యం ఆగడాలపై ఫిర్యాదు చేసేందుకు ఎవరైనా ఎక్సైజ్ కార్యాలయానికి వెళితే మాత్రం అక్కడ అధికారులు అందుబాటులో ఉండరని, కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి ఎవరైనా మద్యం ఆగడాలపై ప్రశ్నిస్తే.. 'నిజమా? మా దృష్టికి రాలేదే'.? అంటూ%% అమాయకపు చూపులు చూడటం అధికారులకు పరిపాటిగా మారిందన్నారు. మండల కేంద్రంలో ఎక్కడపడితే అక్కడ తాగినోడుకి తాగినంత...మందు మస్తుగా దొరుకుతున్నదని, ఏ ఊర్లె చూసినా, ఏ సందులో చూసినా బెల్టుషాపులు పుట్టగొడుగుల్లెక్క వెలుస్తున్నాయన్నారు. పగలు రాత్రి తేడా లేకుండా వాటిలో మద్యం బహిరంగంగా విక్రయిస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడ చూసిన వైన్ షాప్ టు వయా బెల్టు షాప్ ల అక్రమ రవాణా ఆర్టీసీ కార్గో రవాణాను తలపిస్తుందన్నారు. ఏజెన్సీలో అధిక ధరలతో అక్రమ దందా, మూడు పువ్వులు ఆరు కాయలుగా తేజరిల్లుతోందన్నారు. ఈ విషయంలో సంబంధిత ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతోందన్నారు. పట్టపగలే బెల్టు షాపులకు మద్యం తరలివెళ్తున్న, తెలిపినప్పటికీ, మద్యం అక్రమ విక్రయాల పట్ల ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టవు అన్నట్టు గాఢ నిద్రలో మునిగి పోయారని విమర్శించారు. మరోవైపు బెల్ట్ షాపుల వల్ల మద్యపానం వినియోగం పెరగడమే కాకుండా నియంత్రణ లేని మద్యం అమ్మకాలతో అనేకమంది అప్పుల పాలవుతున్నారని, మహిళలు వేధింపులకు గురవుతారని,అల్లరి మూకలు పెట్రేగి పోతాన్నారని అందువల్ల బెల్ట్ షాపులను ఎక్కడకక్కడ కట్టడి చేయాలన్నారు. ప్రజల ఫిర్యాదులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి వీటిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్యం అక్రమ దందాను నియంత్రించి, నిబంధనలను పాటించని వైన్ దుకాణాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# పుష్కరాలకు ప్రత్యేక రవాణా సౌకర్యం



జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధిమే 14: భక్తులకు శుభవార్త! ఈ నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు కాళేశ్వరం లో జరుగనున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు భూపాలపల్లి డిపో మేనేజర్ ఎ.ఇందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు సరస్వతీ పుష్కరాలు సందర్భంగా భూపాలపల్లి బస్టాండ్ నుంచి కాళేశ్వరం వరకు రోజూ 47 రెగ్యులర్ సర్వీసులతో పాటు అదనంగా 70 ప్రత్యేక బస్సులు మొత్తం 130 ట్రిప్స్ నిర్వహించను న్నట్లు డీ ఎం ఇందు పేర్కొన్నారు.బస్సు టికెట్ ధరలు:భూపాలపల్లి-కాళేశ్వరం: ఫుల్ టికెట్ -120 / హాఫ్ టికెట్ -70హన్మకొండ-కాళేశ్వరం: ఫుల్ టికెట్-250/ హాఫ్ టికెట్-140..ప్రయాణికులు ఈ ప్రత్యేక సదవకాశాన్ని వినియోగిం చుకొని కాళేశ్వరుని దివ్య దర్శనం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. మహాలక్ష్మి పథకం కూడా ఈ సేవలకు వర్తించనుంది.

# అందుబాటులోకి జీహెచ్ఎంసీ యాప్




హైదరాబాద్, మే 14,: హైదరాబాద్ నగర జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. జనాభా తోపాటు.. సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. మై జీహెచ్ఎంసీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా సమస్యల పరిష్కారాన్ని సులభతరం చేశారు. పలు సేవలను అందిస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రజల కోసం జీహెచ్ఎంసీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. పలు రకాల పౌర సేవలను అందించడానికి 'మై జీహెచ్ఎంసీ' మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా అందించే సేవలను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వి కర్ణన్ వివరించారు. నగర పౌరులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. అరచేతి నుంచే సేవలను పొందాలని సూచించారు..ఈ యాప్ ద్వారా పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్, ఆరోగ్యం, వీధి దీపాలు, మురుగునీటి సమస్య, రహదారులను ఊడ్చడం వంటి సమస్యలపై ఫిర్యాదు చేయాల్సి వస్తే.. ఫొటో తీసి సమస్య ఉన్న ప్రాంతం నుంచే ఫిర్యాదు చేయవచ్చు..పౌరులు పంపిన ఫొటోలను కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలిస్తారు. యాప్‌లో ఫిర్యాదు నమోదైన ప్రాంతానికి సంబంధిత అధికారులను పంపిస్తారు..ఫిర్యాదు చేసిన వ్యక్తి మొబైల్‌కు కంప్లైంట్ నంబర్, సంబంధిత అధికారి ఫోన్ నెంబర్లతో మెసేజ్ వస్తుంది. యాప్‌లో ఫిర్యాదు పరిష్కారమైందా, లేదా అని సూరిచూసుకోవచ్చుసమస్య పరిష్కారం కాకపోయినా.. అయినట్టు చూపే అధికారులపై కంట్రోల్ రూమ్ నంబర్ 040-21111111 కు ఫిర్యాదు చేయొచ్చు.సమస్యల పరిష్కారమే కాకుండా.. పలు సేవల కోసం దీన్ని వినియోగించవచ్చు. ట్రేడ్ లైసెన్సుకు దరఖాస్తు, ఆస్తిపన్ను మదింపు, పెంపుడు శునకానికి లైసెన్సు తీసుకోవడం, నిర్మాణ వ్యర్థాల తరలింపునకు వాహనాన్ని బుక్ చేసుకోవచ్చు.ప్రజల నివాస ప్రాంతాల్లో దోమల సమస్య, వీధి దీపాల ఏర్పాటు, రోడ్లపై గుంతలు, వీధి కుక్కలు, ఆహార కల్తీ, తదితర సమస్యలపైనా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.ట్రేడ్ లైసెన్సు, ఆస్తిపన్ను, ఇతరత్రా పన్నులను డెబిట్ కార్డు, యుపీఐ ద్వారా చెల్లించవచ్చు. జీహెచ్ఎంసీ కార్యాలయాలు, వార్డు ఆఫీసులు, ప్రజా మరుగుదొడ్లు, వాతావరణ సమాచారం.. ఇలా చాలా అవసరమైన సేవలు పొందవచ్చు..గ్రేటర్ ప్రజల సౌకర్యం కోసం ఈ యాప్‌ను మరింత సులభతరంగా మార్చామని.. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వి కర్ణన్ వివరించారు. ఈ యాప్‌ను ఉపయోగించుకుని వ్యక్తిగత, సమాజ సమస్యల పరిష్కారం పొందవచ్చని చెప్పారు..ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉంది. దీన్ని ప్లే స్టోర్, యాప్ స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.డిజిటల్‌గా సంతకం చేసిన జనన, మరణ ధృవపత్రాలను దీని ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇంటి నుంచి నిర్మాణ వ్యర్థాలను తొలగించడానికి ఈ యాప్ ద్వారా వాహనాన్ని బుక్ చేసుకోవచ్చు.

# స్వయం ఉపాధితో మహిళల ఆర్థిక బలోపేతం

**ప్రభుత్వ శిక్షణలు, పథకాలు సద్వినియోగం చేసుకోవాలి**

**ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**


తిమ్మాపూర్ మండలం మే 14: ప్రభుత్వం అందజేస్తున్న శిక్షణలు, పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. తిమ్మాపూర్ ఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో 20 మంది మహిళలకు ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్ లో గత నెల 12 నుండి ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సాధికారథ లక్ష్యంగా, వారు ఆర్థికంగా బలోపేతం కావాలన్న ఉద్దేశంతో విభిన్నంగా ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్ లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ ఆటోలను పైసా ఖర్చు లేకుండా నడుపుకోవచ్చని, తద్వారా రోజు వారి ఆదాయం సంపాదించవచ్చని అన్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను ఆటోల్లో తీసుకెళ్లడం ద్వారా మహిళలు నికర ఆదాయం పొందవచ్చని సూచించారు. జీవన ప్రమాణానికి, పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా సంపాదించడం అవసరమైన ఈ రోజుల్లో స్వయం ఉపాధి మహిళలకు ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. మహిళ ఆటో డ్రైవర్లు నిర్దిష్ట గమ్యాన్ని సురక్షితంగా చేరుస్తారని తెలిపారు. ఇదివరకే కరీంనగర్లో ఎన్నో సంవత్సరాలుగా ఆటో డ్రైవింగ్ వృత్తిలో రాణిస్తున్న పలువురు మహిళా ఆటో డ్రైవర్లు ప్రజల నుండి ప్రశంసలు అందుకుంటున్నారని తెలిపారు. శిక్షణ విజయవంతంగా పూర్తి అయిన తర్వాత మహిళలు ఆటోలు కొనుగోలు చేసేందుకు రుణ సదుపాయం కల్పించే ఏర్పాట్లు చేస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని బృందాలకు ఎలక్ట్రికల్ ఆటో రంగంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ గా మహిళలు రాణిస్తూ



తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలని, డ్రైవింగ్ రంగంలోకి మరింత మంది మహిళలను ఆకర్షించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవింగ్ రంగంలో రాణిస్తున్న మహిళలు వారి అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళ డ్రైవర్లు ఆటో నడుపుతుండగా జిల్లా కలెక్టర్ ప్రయాణించారు. మహిళా ఆటో డ్రైవర్ల శిక్షణకు సహకరించిన బజాజ్ బృందాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ సుధారాణి, రాజ కిషన్ రెడ్డి, బజాజ్ కంపెనీ మేనేజర్లు అనిల్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

# శ్రీ అభయాంజనేయ స్వామి గణపతి నవగ్రహ ప్రతిష్ట

## ముస్తాబైన దేవాలయం



కమాన్ పూర్ మే 14: రామగిరి మండలం కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోనీ ప్రశాంత్ నగర్ లో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో గణపతి నవగ్రహాలు శ్రీరామచంద్రస్వామి ఉత్సవమూర్తుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఈనెల 17 నుండి 19వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. నూతనంగా నిర్మించిన ఈ ఆలయాన్ని పూర్తిగా ముస్తాబు చేశారు. ఇందులో అభయాంజనేయ స్వామి మరియు గణపతి నవగ్రహాలు ఆరడుగుల శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం శ్రీ రామచంద్ర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట ఈనెల 19న నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈనెల 17న శనివారం రోజు గణపతి పూజ పుణ్య హవచనము, రుత్విక్ మరణము పంచగవ్య మేళన ప్రాశనము కంకణ ధారణము అఖండ దీపారాధన అంకురార్పణము మాతృక వాస్తు యోగిని నవగ్రహ సర్వతోభద్ర మండల స్థాపనము నిర్వహించబడును. అదే రోజు స్థాపిత దేవత హవనములు జలాధివాసము పూజా హారతి నిర్వహించబడును. 18న ఆవాహిక మంటప పూజ అలాగే దంపతులచే విగ్రహాల పైన పాలు నీళ్లు పోయడం జరుగుతుందని తెలిపారు. దంపతులచే సామూహిక హవనము నవగ్రహ శ్రీరామ హనుమాన్ లక్ష్మీ హరణము ప్రసాద వినియోగం నిర్వహించబ డును. 19న దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించడం జరుగుతుంది. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని కాసుల చంద్రశేఖర శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించబడును. కావున భక్తులు భారీ ఎత్తున హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ వారికి తప్పకుండా అవకాశాలు

**పైరవీలతో పదవులు రావు.. అర్హతలు ఉన్న వారికే పదవులు.. సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర**



జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి మే14: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారందరికీ తగిన గుర్తింపు లభిస్తుందని, పైరవీలతో పదవులు రావని, అర్హతలు ఉన్న వారికే పదవులు వస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం రేగొండ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఉమ్మడి రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య అధ్యక్షతన రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల నేతలతో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సంస్థాగత ఎన్నికల జిల్లా పరిశీలకులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, మాసంపెల్లి లింగాజి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయి నుండి పార్టీ నిర్మాణంలో సామాజిక న్యాయం పాటించడం ద్వారా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుద్దామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ అన్నారని గుర్తుచేశారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణే.. కాంగ్రెస్ సిద్ధాంతమని ఈ సందర్భంగా తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ ప్రక్షాళనలో పీసీసీ పరిశీలకుల బాధ్యత అత్యంత కీలకమైందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు.



పేద ప్రజలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోంది: పేద, నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. ఈరోజు రేగొండ మండల కేంద్రంలో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం అనంతరం రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 55 మందికి సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.19,85,000 విలువ కలిగిన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ఆపదలో సీఎం సహాయనిధి ఆపద్బాంధులా ఆదుకుంటుందని తెలిపారు. మానవతా దృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలను ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వ అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గుర్తు చేశారు.



రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి: భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులను రైతులందరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. రేగొండ మండలం జూబ్లీనగర్ గ్రామంలో ఏర్పాటుచేసిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులను రైతులందరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గతంలో ఉన్న ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం గుర్తించి ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం భూ భారతిని తీసుకు వచ్చిందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం సులువైన మరియు పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. భూ భారతి నూతన ఆర్ఓఆర్ రెవెన్యూ చట్టంపై పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలోనే ఒక్క రేగొండ మండలాన్ని ఎంపిక చేసి రైతుల నుండి సలహాలు, సూచనలు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ అన్ని కార్యక్రమాలల్లో ఎమ్మెల్యే వెంట వివిధ శాఖల అధికారులు, అన్ని గ్రామాల ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

# ఉపాధి హామీ పథకానికి ఎసరు పెడుతున్న కేంద్ర ప్రభుత్వం

**-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్**



మంథని ప్రతినిధి,మే 14: ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం ఎసరు పెడుతున్నదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ ఆరోపించారు. బుధవారం మంథని మండలం గద్దలపల్లి గ్రామంలో జరుగుచున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో అనేక నిబంధనలు పెడుతూ కూలీలను శ్రమదోపిడికి గురి చేస్తుందని అన్నారు ఎర్రటి ఎండలో కూలీలు పనిచేస్తే కేవలం 50 రూపాయలు కూలి పడడం ఏంటని ప్రశ్నించారు ఎండలో ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం కూలీలు పనిచేయలేకపోతున్నారని అన్నారు కొలతలు తగ్గించాలని ప్రతికూలికి 307 రూపాయలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో అనేక షరతులు నిబంధనలు కొర్రీలు పెట్టి ఉపాధి హామీ పథకానికి పెసరు పెడుతుందని విమర్శించారు ఇప్పటికైనా అధికారులు స్పందించి పని ప్రదేశంలో నీడ నీటి సౌకర్యం కల్పించి బకాయి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రామ్ రెడ్డి రాజిరెడ్డి బాలయ్య రాములు తదితరులు పాల్గొన్నారు.

# అపర భగీరధుడు సర్ ఆర్ధర్ కాటన్

## -నేడు ఆయన జయంతి



( పెండ్యాల రామ్ కుమార్, మంథని ): మానవ జాతి వికాసానికి సృష్టి అందించిన వరప్రసాదమే సర్ ఆర్ధ్ కాటన్. మదరాసు రాష్ట్రంలో వారు అమలు చేసిన నీటి పారుదల పనులు అద్వితీయ మైన విజయాలు సాధించాయి. సర్ ఆర్ధర్ కాటన్ దూరదృష్టి, సునిశి త మేధాశక్తి అమోఘం, అద్వితీయం. దక్షిణ భారతావనిలో ఎన్నో నీటి పారుదల రూపకల్పన చేసిన అన్న దాత సర్ ఆర్ధర్ కాటన్ ను ప్రభుత్వం సముచితంగా అనేక బిరుదులతో సన్మానించింది. 1803 మే 15వ తేది కాటన్ జన్మించారు. కుటుంబంలో అందరికంటే తల్లి వ్యక్తిత్వ ప్రభావం ఆయనపై పడింది. కాటన్ చిన్నతనం నుంచి మనో వికాసానికి సాహసానికి, ధైర్యానికి, దీక్షకు మారుపేరు. తల్లి ఇచ్చిన శిక్షణ కాటన్ కి ఎంతో ఉపక రించింది. 15 ఏళ్ళ ప్రాయంలో ఇండియాకు వెళ్ళడానికి స్కాలర్ షిప్ పొందారు. 1819 సం?? నికి ఆర్ధర్ కాటన్ జాగ్రత్తగా చదువుకొని మంచి క్రమశిక్షణతో మెలిగి అది స్కాంబి లో చక్కగా విద్యనభ్యసించి ఏ పరీక్షకు హాజరు కాకుండానే రాయల్ ఇంజనీర్ సర్టిఫికేట్ ఆధారంగా ఉద్యోగం సంపాదించారు. 1821 లో 18 సం?? ప్రాయంలో ఇండియాలో ఉద్యోగంలో నియమింపబడ్డారు. 1822 సం??లో అనేక జిల్లాల్లోని చెరువు మరమత్తు పనులను పర్యవేక్షించే పనిని అప్పగించారు. 1824 సం?? వరకు ఈవిధంగా పనిచేసి మద్రాసు దక్షిణాన కొన్ని మైళ్ళ దూరంతో వున్న మిలిటరీ స్థావరమైన ధామస్ మౌంట్ దగ్గర భవనాలు నిర్మించడానికి నియమించబడిరి. ఎనిమిదేళ్ళ సర్వీసు అయిన తర్వాత కెప్టెన్ ర్యాంక్ కు ఎదగారు. ఆయల కృషి వల్ల తంజావూరు జిల్లాలోని అనే నిర్మాణపు పనులు పూర్తి అయి రాష్టంతో సంపన్న జిల్లా గా మారింది.

1828 - 29 సం?? లలో అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశారు. తరువాత అనారోగ్య కారణాలవల్ల ఇంగ్లాండు తిరిగి వెళ్ళనలసి వచ్చింది. 1832 లో తిరిగి ఉద్యోగంలో ప్రవేశించారు. శక్తికి మించిన శ్రమ చేయడం వల్ల తరచు అనారోగ్యానికి గురయ్యేవారు. ఈసారి ఆస్ట్రేలియాకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడ వుండగా ఒక ధనవంతుని కుమార్తె ఎలిజబెత్ ని ప్రేమించి వివాహమాడారి. 1841 సం?? లో అక్టోబరు 10వ తేదీన వీరి వివాహం జరిగింది. తరువాత తిరిగి టాస్మోనియా వెళ్ళారు. ఆ సమయంలో రాజమండ్రి జిల్లా పరిస్తితి అధ్వాహ్నంగా ఉండేది. గోదావరి తో పారే నీటిని వినియోగించి ఆ భూములను సస్యశ్యామలం చేయటం జరిగింది. అప్పటినుంచీ రాజమండ్రి జిల్లా గోదావరి జిల్లా గా పేరు గాంచింది. గోదావరి నదిపై 12 లక్షల ఎకరాల సాగుకు ఉపయోగపడే ఒక ఆనకట్ట నిర్మించబడింది. ఈ ఆనకట నిర్మాణం ద్వారా ఆయన కన్న కలలు నిజమయ్యాయి. కాల్వలు తరువాత కాల్వలు, పిల్లకాత్వతు, పంట కాల్వలు త్రవ్వడం జరిగింది. 1841 నుండి 45 సం??లు నీటి పారుదల పథకాల అమలుకై ఆయన నిర్విరామ కృషి చేశారు. 1881 వ సం??లో ప్రచురించిన %--%వీలున్నచోట నీటి పారుదలకు కాల్వలను ఏర్పాటు చేయాలి. వర్షపు నీరు, బావి నీరు, ఇతర విధానాల ద్వారా లభించే నీటి కన్నా భూమిని సారవంతం చేసే ఎరువు గల్గిన నీటుని పొలాలలకు కాల్వల దారా పారించవచ్చును. %--%ఒక చోటినుండి ఇంకొక చోటికి ఉత్పత్తులను కారు చౌక ఎగుమతి చేయడానికి నీటి కంటే మరొక ఉత్తమ సాధనం లేదు. ఆ కారణంగా నీటి పారుదల కాల్వలను స్టీమ్ బోట్ లు తిరగడానికి వాలుగా నౌకాయాన సౌకర్యాలు కల్పించారు. ధవళేశ్వరం ఆలకట్ట నిర్మాణంలో సర్ ఆర్ధర్ కాటన్ చూపిన ప్రతి భాపాటవాలు నేటికి మరువలేనివి. ఈ బ్యారేజి నిర్మాణం వల్ల గోదావరి డెల్టాలో 13,75,000 టన్నులు, ధాన్యము, 16,38,000 చెరుకు, 34,000 టన్నుల పప్పు ధాన్యము, చిరుధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యారేజి నిఢిని 3.6. కి.మీ. దేశంతో కెల్ల అతి పెద్దదైల ధవళేశ్వరం బ్యారేజి సర్ ఆర్ధర్ కాటన్ బ్యారేజిగా పిలువ బడుతున్నది. ఇండియాలో పబ్లిక్ వర్క్స్ అనే పుస్తకాన్ని కూడా ఆయన రాసారు. మానవ జాతి మహెూదయానికి ఇంజనీరుగా రచయితగా ఆలోచలా పరులుగా శ్రీ కాటన్ చేసిన కృషి చిరస్మరణీయమైంది.

ఆయన పేదరిక నిర్మూలనకు కరువు నివారణకు అనేక నీటి పథకాలు అమలు చేసి చరిత్ర ప్రసిద్ధుడైయాడు. ఎన్ని పనులు చేసినా ఆయన సామాన్యుడే. ధర్మాన్ని నిర్వర్తించాడు. అభివృద్ధే ఆయన ఆదర్శం. అందుకే ఆయనను అన్నదాతగా పిలిచేవారు. ప్రజల హృదయాలలో శాశ్విత స్థానాన్ని ఏర్పరచుకొని 1899 జులై 24వ తేది పరమపదించారు.

# కురుమవాడ బాల భక్తాంజనేయ ఆలయంలో హనుమాన్ స్వాములకు అన్నప్రసాదం

**పెద్ద హనుమాన్ జయంతి వరకు కొత్త జయపాల్ రెడ్డి కూరగాయలు వితరణ**



కరీంనగర్, కరీంనగర్ లోని కురుమవాడ బాల భక్తాంజనేయ ఆలయంలో హనుమాన్ దీక్షాపరులు ప్రత్యేక పూజలు చేవడుతున్నారు. గత 13 రోజులుగా స్వాములు అభిషేకాలతోపాటు హనుమాన్ చాలీసా, భజనలతో ఆలయ ప్రాంగణమంతా భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ డి సంపత్ ఆధ్వర్యంలో దీక్షాపరులకు బుధవారం 14వ రోజు హనుమాన్ దీక్షాపరులకు బిక్ష కార్యక్రమం చేపట్టారు. మంకమ్మతోటకు చెందిన పొద్దుటూరి నాగేందర్, పొద్దుటూరి రాజేందర్, పొద్దుటూరి మహేందర్ లు మెడికల్ రంగంలో పనిచేస్తున్నారు. వీరు నేటి బిక్షకు దాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 10వ తేదీ నుండి పెద్ద హనుమాన్ జయంతి వరకూ కొత్త జయపాల్ రెడ్డి కూరగాయల దాతగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. దాతలకు సకల సౌక్యాలు కలగాలని... ఆయురారోగ్యాలతో కలకాలం జీవించేలా ఆంజనేయస్వామి ఆశీర్వదించాలని... డి సంపత్ ఆకాంక్షించారు. సుమారు 180 మంది హనుమాన్ దీక్షాపరులకు బోజనం అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాల భక్తాంజనేయ స్వామి ఆలయ అర్చకులు చింతల రమేష్, జాతర కొండ శ్రీనివాస్, సంద అశోక్, శ్రీ రామోజీ శ్రీధర్, వడమళ్ళ సతీష్, వెంగళ శ్రీనివాస్, ఇంజపూరి ప్రవీణ్, ఎం మల్లేశం, ఏ శ్రీనివాస్, పెద్ది గట్టయ్య, భాను, ఆటో విజయ్, మహిళా సేవకులు సరస్వతి, రజిత, లక్ష్మిస, రాధిక, మమత, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ సభతో బి ఆర్ ఎస్ పార్టీలో కొత్త ఎనర్జీ

**హైదరాబాద్ లో వరంగల్ నేతలతో కీలక సమావేశం ఏర్పాటు చేసిన కేటిఆర్**

**సభ ఏర్పాట్ల విషయంలో పెద్దిని కేటిఆర్ మెచ్చు కున్నట్లు సమాచారం**

**ఎల్కతుర్తి సభ తర్వాత రాజకీయాలు మారాయి,కాంగ్రెస్ అంతానికి ఆరంభం మొదలైందన్న కేటిఆర్**



నర్సంపేట మే 14 (ప్రజాక్రాంతి) వరంగల్ ఎల్కతుర్తి సభ సక్సెస్ అయింది,కాంగ్రెస్ అంతానికి బిఆర్ఎస్ ప్రతి కార్యకర్త కలిసి కట్టుగా పని చేయాలని కేటిఆర్ సూచించినట్లు సమాచారం.వరంగల్ సభ సక్సెస్ అయిన సందర్భంగా కేటిఆర్ హైదరాబాద్ లో వరంగల్ ముఖ్య నాయకులతో ప్రత్యేకఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సవత్సరం లోపే ప్రజావెతిరేకతను ముటకట్టుకున్నదన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఆదేశాలు జారిచేసినట్లు తెలిసింది.రాబోయే రోజుల్లో రైతుల ఆత్మహత్యలు, ధాన్యం కొనుగోళ్లలో చూపిస్తున్న జాప్యం, రైతుభరోసా చెల్లింపులు, అకాలవర్షంతో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించక పోవడంపై దశలవారీగా పోరాటలు నిర్వహించాలని అన్నట్లు తెలిసింది.25 సవత్సరాల సంబరాన్ని కేటిఆర్ వరంగల్ గడ్డపై సభ నిర్వహించడం గర్వకారంగా ఉందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్దితో పాటు వరంగల్ ముఖ్య నాయకులతో కేటిఆర్ సుధీర్గంగా ముచ్చట్లు జరిపినట్లు తెలిసింది.పెద్దిని అభినడిచిన కేటిఆర్.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన పెద్ది సుదర్శన్ రెడ్డి వరంగల్ ఎల్కతుర్తి లో జరిగిన భారీ భారీహిరంగ సభ నిర్వహించడంలో కీలక భూమిక పోషించారని కేటిఆర్ తో పాటు జిల్లా నేతలు పెద్దిని అభినందినట్లు తెలిసింది. సభ సక్సెస్ లో అందరిది కీలక పాత్రే.. వరంగల్ సభ సక్సెస్ లో వరంగల్ ముఖ్య నాయకులతో పాటు కార్యకర్తలు విస్తృతంగాపని చేయడంవల్లే ఎలాంటి అవంతరాలు రాకుండ సభ సక్సెస్ అయిందని వరంగల్ జిల్లా నాయ కులతో ఇష్టా గోష్టిగా కేటిఆర్ సంభాషనలు జరిపినట్లు సమాచారం

# అప్రమత్తంగా ఉండండి..

**అధిక సేవలు అందించండి**

**అధికారులకు కలెక్టర్ ఆదేశం**





**జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి మే 14:** సరస్వతి పుష్కర విధులు కేటాయయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ 12 రోజులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం కాళేశ్వరం దేవస్థానంలోని కళ్యాణ మండపంలో విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి కేటాయించిన విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో పెద్ద ఎత్తున సరస్వతి పుష్కరాలు జరుపుతున్నామని, అందుకు తగినట్లుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు లక్షకిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రం ఆసాంతం అప్రమత్తంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ప్రతి అధికారికి కేటాయించిన లొకేషన్స్ లో ముంద స్తుగా పర్యటించి ఏర్పాట్లు పరిశీలన చేయాలని తెలిపారు. గైర్హాజరైన అధికారులకు, సిబ్బందికి ఆయా శాఖలకు తగు చర్యలు నిమిత్తం సిఫారసు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 15వ తేదీ ఉదయం పుష్కరాలు ప్రారంభమవుతాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పుష్కరాలను ప్రారంభించనున్నారని తెలిపారు. 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సరస్వతి మాత విగ్రహం ఆవిష్కరణ, పుష్కర స్నానం తదుపరి స్వామి వారి దర్శనం, గోదావరి హారతి కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారని అనంతరం టెంట్ సిటీ పరిశీలిస్తారని తెలిపారు. కాశీ పండితులతో ప్రత్యేకంగా హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12 సంవత్సరాలకు ఒకసారి జరుగుతున్న ఈ పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని అన్నారు. కుంభమేళా వెళ్లలేని వారు ఇక్కడికి వచ్చే అవకాశం ఉందని ఆ ప్రకారం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ 12 రోజుల విధులు చాలా ముఖ్యమని ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. సరస్వతి ఘాట్ మెయి న్ ఘాట్ వద్ద భక్తులు పుష్కర స్నానాలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. భక్తులకు స్నానాల షవర్లు, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిండ ప్రధాన కార్యక్రమాలు చేసేందుకు కూడా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. స్టాళ్లు, టెంట్ సిటీ, డార్మెటరీ, ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు తు.చ తప్పకవిఐవి ప్రోటోకాల్పాటించాలని సూచించా రు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని కంట్రోల్ రూమ్ కి వచ్చిన సమస్యను తక్షణమే ఆయా శాఖల అధికారులు దృష్టి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాలయంలో భక్తులు క్యూలైన్ పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.50 మందిగజ ఈతగాళ్ళు నాటు పడవలతో పహారా కాస్తున్న ట్లు తెలిపారు. విధులు నిర్వహించే అధికారులు సిబ్బందిని పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కా లిక బస్టాండ్ నుంచి ఘాట్స్ వరకు భక్తుల సౌకర్యార్థం ఉచితంగా 30 షటిల్ బస్సులు నడుపుతున్నామని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుష్కరవిధులు కేటాయించిన అధికారులకు రెండు షిఫ్టుల్లో విధులు కేటాయించామని అప్రమత్తం గా ఉండాలని, సమయానికి విధులకు హాజరు కావాలని తెలిపారు. ఎవరైనా గైర్హాజరు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. విధులు కేటాయించిన సిబ్బందికి భోజన, వసతి ఏర్పాటు చేస్తున్నామని సమయ పాలన పాటించాలని సూచించారు. స్విమ్మర్లు లైఫ్ బాయ్స్, జాకెట్స్ ధరించాలని గోదావరిలో ఏ ఒక్కరు మిస్ అయిన విధులకు ఇబ్బంది కలుగుతుందని అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ డైరెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# బంధన్ ఆసుపత్రి పై చర్యలకు వెనుకడుగు ఎందుకు

**అధికారులు మెతక వైఖరి పై ప్రజల ఆగ్రహం**

ప్రజాక్రాంతి.వరంగల్ ప్రతినిధి: హనుమకొండ నగరం నడిబొడ్డులో ఉన్న బంధన్ ఆసుపత్రి పై అధికారులు చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని నగరంలో విమర్శలు వినిపిస్తున్నాయి ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల నుండి చికిత్స కోసం రకరకాల రోగులు ఆసుపత్రులకు చేరడానికి వస్తుంటారని జిల్లా కేంద్రాలలోనే ఈ పరిస్థితులు ఉంటే ప్రాణాలు నిలుపుకునేది ఎట్లా అని ప్రజలు అధికారులపై తీవ్రంగా మండిపడుతున్నారు బంధన్ ఆసుపత్రి వ్యవహారం ఇటీవల జిల్లా ప్రజలను వేధిస్తుందని వివిధ వర్గాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కొద్ది కాలంలోనే బంధన్ ఆస్పత్రిలో రెండు ప్రాణాలు పోగా ఒక జర్నలిస్ట్ కోలుకోలేని పరిస్థితిలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు జర్నలిస్ట్ పరిస్థితికి బంధన్ వైద్యుల నిర్వాహకమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు బంధన్ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సరైన ప్రమాణాలు పాటించకుండా చికిత్స చేయడం పట్ల పట్టణంలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు వైద్యులు దేవుళ్ళతో సమానమని అలాంటి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజల నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నారని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి బంధన్ ఆసుపత్రి యజమాన్యంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించకపోవడం పట్ల మతల ఏమిటని ప్రజలు నిలదీస్తున్నారు ఇటీవల రెండు మూడు రోజుల క్రితం వరంగల్ నగరంలోని ఓ ప్రాంతానికి చెందిన రోగి చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్ళగా చికిత్స పొందుతూ ఆకస్మికంగా మృతి చెందిన ఘటన కుటుంబ సభ్యులతో పాటు జిల్లా ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తుంది దీనికి కారణమైన వైద్యులపై, బంధం ఆసుపత్రి యాజమాన్యంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనకడుగు వేస్తున్నారని విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి ఆస్పత్రి యజమాన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఏమైనా ముడుపులతో సర్దుబాటు చేశారా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి బంధన్ ఆసుపత్రి యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు,కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.అధికారులు మెతక వైఖరి పై అనుమానాలు: బంధన్ ఆస్పత్రి పై చర్యలు తీసుకోవడంలో అధికారుల మెతికవేకరిపై ప్రజలకు అనేక అనుమానాలు చోటుచేసుకున్నాయి వరుస సంఘటనలతో బంధన్ ఆసుపత్రి యాజమాన్యం గుణపాఠం నేర్చుకోకపోవడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతవ్యక్తమవుతుంది కొద్ది కాలంలోనే బంధన్ ఆసుపత్రిలో ఇద్దరు రోగులు మరణించడం ఓ జర్నలిస్ట్ మరణం అంచులు దాకా వెళ్లి బయటపడడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి బంధన్ ఆసుపత్రిలో నిపుణులైన వైద్యులు ఉన్నారా లేరా అన్న సందేహాలను జిల్లా ప్రజలు వ్యక్తం చేస్తున్నారు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న బంధన్ ఆసుపత్రి యాజమాన్యంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకున్నట్లయితే జిల్లాలోని ఆసుపత్రుల్లో మార్పు వచ్చే పరిస్థితి ఉంటుందని ప్రజలు కోరుతున్నారు విచ్చలవిడిగా ఆసుపత్రులు ఏర్పాటుతోపాటు ఆసుపత్రులు ప్రజలను ముక్కుపిండి డబ్బులు వసూలు చేసుకుని అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు ఆసుపత్రిలో చేరిందంటే చాలు జేబులు ఖాళీ అయినట్లే అన్న అపవాదు జిల్లా ఆస్పత్రులపై నెలకొంది ఈ క్రమంలో ఆసుపత్రిలో చేరే వివిధ రోగాల నుండి ఆసుపత్రులు యజమాన్యాలు వివిధ రకాల పరీక్షలు పేరుతో ప్రజల డబ్బును దోచుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి బంధన్ ఆసుపత్రి పరిణామాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తక్షణమే కమిటీని వేసి ఆస్పత్రిలో జరిగిన వ్యవహారాలను ప్రజలకు తెలిపాల్సిన అవసరం ఉందని పలువురు ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పారావును సంప్రదించగా ముగ్గురితో కమిటీ వేసి నిజానిజాలను తేల్చి ప్రజలకు తెలియపరుస్తామని ఆయన తెలిపారు.

## బీసీ వసతి గృహం బాలికకు కాంస్య పతకం



కరీంనగర్,:ప్రభుత్వ బిసి బాలికల హాస్టల్లో ఉంటూ ఎస్.ఆర్.ఆర్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న సిరిచందన డెహ్రాడూన్ లో జరిగిన ఏసియన్ పవర్ లిఫ్టింగ్ జూనియర్ విభాగంలో కాంస్య పథకం సాధించారు. ఏసియన్ యూనివర్సిటీ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సిరి చందనను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సిరిచందనను బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, జిల్లా యువజన క్రీడా అధికారి శ్రీనివాస్ అభినందించారు.

జనని నాదం

# యుద్ధానికి కారణం.. కాలసర్పదోషమేనా!



కాలచక్రంలో గ్రహగతులు ఒక్కోసారి విపత్కర పరిస్థితులు కల్పిస్తాయి. ఊహించని ఉపద్రవాలను సృష్టిస్తాయి. మొన్నటి పహల్గాం ఘటన, నిన్నటి ఆపరేషన్ సిందూర్, ఆపై సీజ్‌ఫైర్ వీటన్నిటికీ ఖగోళంలో చోటు చేసుకున్న పరిణామాలు కారణంగా కనిపిస్తున్నాయని జ్యోతిశ్శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాలసర్ప దోష ప్రభావం యుద్ధానికి దారితీసిందని లెక్కలు కడుతున్నారు. అయితే, సీజ్‌ఫైర్ తాత్కాలికమేనని.. రానున్న రోజుల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని కూడా విశ్లేషిస్తున్నారు.

జ్యోతిశ్శాస్త్ర రీత్యా కాలసర్పయోగాన్ని దోషంగా పరిగణిస్తారు. గ్రహాలన్నీ రాహువు, కేతువు మధ్య చిక్కుబడిపోతే.. దాన్ని కాలసర్ప దోషంగా చెబుతారు. ఇది ఏర్పడినప్పుడు.. రాజ్యమంతా రాహుకేతు వులదే! మిగతా గ్రహాల శక్తి దాదాపు నిర్వీర్యం అవుతుంది. ఈ ఉగాది నుంచి కాలసర్పదోషం నెలలో పక్షం రోజుల పాటు కొనసాగు తూనే ఉంది. ముఖ్యంగా ఏప్రిల్ 25వ తేదీ తెల్లవారుజాము నుంచి ఇది మరింత బలంగా ఏర్పడింది. ఇది, మే 9 వరకు కొనసాగింది. కేతువు ఛాయలో చంద్రుడు ఉన్న సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే.. మే 10 వరకు కూడా దోషం కొనసాగింది. ఈ మధ్యకాలంలోనే భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనుకున్నట్టుగానే, పదో తేదీ సాయంత్రం కాల్పుల విరమణకు ఇరుదేశాలూ అంగీకారం తెలిపినట్టుగా ప్రకటన వెలువడింది.

జరిగిన సంఘటనలను ఒకసారి పరిశీలిస్తే.. కాలసర్పదోష ప్రభావాన్ని కొట్టిపారేయలేమని జ్యోతిశ్శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఏప్రిల్ 22న మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో పహల్గాంలో ముష్కరులు అమాయకులైన పర్యాటకులపై కాల్పులకు తెగబడ్డారు. ఆ సమయాన్ని విశ్లేషిస్తే.. చంద్రుడు యుద్ధ కాముకుడైన కుజుడి నక్షత్రంపై ఉన్నాడు. ఆ కుజుడు.. తన శత్రు గ్రహమైన శని నక్షత్రంపై నీచపొంది ఉన్నాడు. దీనికితోడు పాపగ్రహమైన రాహువు, బలవంతుడైన శనిని దాటుకొని మరింత బలాన్ని సంతరించుకొని కాలసర్పదోషాన్ని ఆహ్వానించడానికి సిద్ధమయ్యాడు. లోతుగా పరిశీలిస్తే.. ఆ ఘటన జరిగిన సమయానికి చంద్రుడు కుజ నక్షత్రంలో రాహు పాదంపై సంచరిస్తున్నాడు. ఫలితంగా పహల్గాం నెత్తురోడింది. తర్వాత రెండు రోజులకే కాలసర్పదోషం యాక్టివేట్ అయింది. తర్వాత పక్షం రోజులకు భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఆ సమయానికి కాలసర్పదోషం పూర్తిస్థాయిలో పనితనం చూపడం మొదలుపెట్టింది. భారత కాలమానం ప్రకారం మన సైన్యం ఆరో తేదీ, అర్ధరాత్రి దాటిన తర్వాత 1.05 (మే 7) నిమిషాలకు పరాక్రమ సిందూరానికి శ్రీకారం చుట్టింది. ఆ సమయాన్ని బట్టి.. లగ్నంపై కుజుడి దృష్టి ప్రభావవంతంగా పనిచేసింది. అప్పుడు కూడా చంద్రుడు శుక్ర నక్షత్రంపై, కుజ పాదంలో సంచరించడం వల్ల యుద్ధానికి దారితీసే పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు మూడు రోజుల పాటు ఇరుదేశాల మధ్య యుద్ధమే జరిగిందని చెప్పవచ్చు. పదో తారీఖున సాయంత్రం 5 గంటల నుంచి ఉభయదేశాలూ కాల్పుల విరమణ పాటిస్తాయన్న ప్రకటన సమయానికి కాలసర్పదోష ప్రభవం కాస్త సన్నగిల్లింది. అయినప్పటికీ, ఆ రాత్రి, మర్నాడు ఉదయం కూడా ఉద్రిక్తతలు కొనసాగాయి. చంద్రుడు% కుజ, రాహు నక్షత్రాల మీదుగా సంచరించడం కారణంగా సీజ్‌ఫైర్‌ని అతిక్రమించి పాక్ డ్రోన్ దాడులకు పాల్పడింది. అయితే, పూర్ణ చంద్రుడు కావడంతో.. 12వ తేదీ తెల్లవారుజామున బృహస్పతి నక్షత్రంలోకి ప్రవేశించి గజకేసరీ యోగం ఏర్పడటంతో ఉద్రిక్తతలు కాస్త నెమ్మదించాయి. అయితే మే 20వ తేదీ నుంచి మరోసారి కాలసర్పదోషం యాక్టివేట్ కానుంది. ఇది జూన్ 5 వరకు కొనసాగుతుంది. ఈ దరిమిలా మరోసారి ఉభయ దేశాల మధ్య తీవ్ర పరిస్థితులు నెలకొనే ప్రమాదం లేకపోలేదని జ్యోతిశ్శాస్త్రజ్ఞులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జూన్ 17 నుంచి జూలై 1వ వరకు ఏర్పడే కాలసర్పదోష సమయంలోనూ ఇదే తరహా వాతావరణం ఉండొచ్చని చెబుతున్నారు. జూలై నెలాఖరుకు కాలసర్పదోషం పూర్తి స్థాయిలో తొలగిపోనుంది. ఆ తర్వాత యుద్ధ మేఘాలు తొలగిపోతాయని వారు అంచనావేస్తున్నారు.

ఈసారి భిన్నం..: పుష్కర కాలంలో దాదాపు ఏడెనిమిదేండ్లు ఈ కాలసర్పదోషం ఏర్పడుతూ ఉంటుంది. చంద్రుడి సంచారాన్ని బట్టి దోషం యాక్టివేట్, డీ యాక్టివేట్ అవుతూ ఉంటుంది. అలా దోషం ఏర్పడినప్పుడల్లా యుద్ధాలు జరుగుతాయని చెప్పడం సరికాదు. కానీ, ఈసారి శని, రాహువులు అత్యంత సమీపంగా కదలడం, ఆ సమయంలోనే కుజుడు నీచ పొంది ఉండటం వల్ల.. తీవ్రత పెరిగింది. 1999లో కార్గిల్ యుద్ధ సమయంలోనూ అర్ధ కాలసర్ప దోషం ఉంది. ఈ సమయంలో శని నీచ పొందడం, శనిపై కుజుడి వక్ర దృష్టి సోకడంతో అప్పటి పరిస్థితులు తీవ్ర యుద్ధానికి దారితీశాయి.

# బాంబు వల్ల కాదు, ఆకలితో చనిపోతారు


## ఐక్యరాజ్యసమితి



గాజా నగరం : గాజాకు మానవతా సహాయాన్ని కూడా ఇజ్రాయిల్ యుద్ధ ఆయుధంగా మారుస్తోందని ఐక్యరాజ్యసమితి ఏజెన్సీ తెలిపింది. గాజా ప్రజలు ఎదుర్కొంటున్న బాధలు, విషాదం మాటల్లో చెప్పలేనిది, రెండు నెలలకు పైగా ఎటువంటి సహాయం అందలేదని పాలస్తీనా శరణార్థుల సహాయ మరియు మానవాభివృద్ధికి మద్దతు ఇచ్చే ఐక్యరాజ్యసమితి సంస్థ కమిషనర్ జనరల్ ఫిలిప్ లాజారిని బిబిసికి చెప్పారు. "కరువు వ్యాపిస్తోంది, ప్రజలు ఆకలితో అలమటిస్తు న్నారు. రాబోయే రోజుల్లో బాంబు దాడి వల్ల కాదు, ఆహారం లేకపోవడం వల్ల ప్రజలు చనిపోతారు" అని ఆయన అన్నారు. పోషకాహార లోపం, ఆకలి గాజాలో మొత్తం తరానికి జీవితాంతం దుష్ప్రభావం కలిగిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. డబ్ల్యూహెచ్ఓ పాలస్తీనా ప్రతినిధి రిక్ పెప్పర్‌కార్న్ మాట్లాడుతూ క్లినిక్‌లలో చాలా మంది కుంగిపోయిన పిల్లలను తాను చూశానని అన్నారు. ఇజ్రాయి తన వినాశకరమైన దిగ్బంధనను కొనసాగిస్తు న్నందున గాజాకు ఆహారం, నీరు, ఇతర ముఖ్యమైన సామాగ్రిని రెండు నెలలకు పైగా నిలిపివేశారు. మిగిలిన ఇజ్రాయిల్ బందీలను విడుదల చేయమని హమాస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఈ క్రూరత్వం ఒక ఒత్తిడి వ్యూహమని ఇజ్రాయిగీకరించింది. గాజాపై తన వినాశకరమైన దిగ్బంధనను వెంటనే ఎత్తివేయాలని మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇజ్రాయిల్‌కు పిలుపునిచ్చింది. జాతి నిర్మూలనకు ప్రజలను ఆకలితో అలమటించడం యుద్ధ నేరమని పేర్కొంది. ఖాన్‌యూనిస్‌లోని నాజర్‌ఆసుపత్రిపై మంగళవారం ఇజ్రా యిల్‌బాంబు దాడి చేసి, జర్నలిస్ట్ హసన్ ఎస్లాతో సహా ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి నెతన్యాహు స్పందిస్తూ, రాబోయే రోజుల్లో సైన్యం పూర్తి శక్తితో దాడి చేస్తుందని అన్నారు.

# కళకళలాడుతున్న లాడ్ బజార్

హైదరాబాద్, మే 14: హైదరాబాద్ నగరం పాతబస్తీలోని చార్మినార్ పరిసర ప్రాంతంలో ప్రసిద్ధ గాజుల మార్కెటే ఈ లాడ్ బజార్. ఇక్కడ ప్రత్యేకంగా తయారుచేసిన గాజులు విరివిగా దొరుకుతాయి. లాడ్ బజార్‌లో షాపింగ్ చేయడానికి వచ్చే ఆడవాళ్లతో ఆ ప్రాంతమంతా ఎప్పుడూ సందడిగా ఉంటుంది. అంతటి పేరున్న ఈ ప్రాంతం కొన్ని రోజులుగా మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. దీనికి ప్రధాన కారణం మిస్ వరల్డ్ పోటీలకు చెందిన అంతర్జాతీయ సుందరీమణులు ఇటీవల చార్మినార్‌ను సందర్శించడమే. ప్రపంచ దేశాల అందగత్తెలు ఈ ప్రాంతాన్ని సందర్శించడంతో అందరి నోళ్లలో ఇప్పుడు లాడ్ బజార్ పేరే వినబడుతోంది. దాంతో పాటు సహజంగానే అమ్మకాలు పెరిగినట్టు స్థానిక వ్యాపారస్తులు చెబుతున్నారు. అయితే.. ఇదే సందర్భాన్ని అవకాశంగా మలచుకున్న గాజుల వ్యాపారులు తమ షాపుల్ని కొత్తగా అలంకరిస్తున్నారు. సందర్శకులను, కొనుగోలుదారులను ఆకర్షించడానికి వింత వింత డిజైన్ల గాజులతో, ట్రెండీ కలర్స్‌తో, శబ్దాన్ని ఇస్తూ మెరిసిపోతున్న వయ్యారపు గాజులతో బజార్‌ను కళకళలాడేలా తీర్చిదిద్దుతున్నారు. పాకిస్థాన్, రాజస్థాన్, లక్నో వంటి తదితర ప్రదేశాల నుంచి తెప్పించిన ప్రత్యేక హ్యాండ్‌మేడ్ గాజులు ఇప్పుడు లాడ్ బజార్‌లో అందుబాటులో ఉన్నాయి. ఎప్పుడూ కళకళలాడుతూ ఉండే చార్మినార్ పరిసరాలు ప్రపంచ అందగత్తెలు రాకతో మరింత కొత్త శోభను సంతరించుకున్నాయి. ఎప్పుడూ సందర్శకులతో హడావిడిగా



ఉండే ఈ ప్రాంతం మిస్ వరల్డ్ బావమల సందర్శనతో మరింత సందడిగా మారింది. ఇది ఒక రకంగా నగర అభివృద్ధికి, వ్యాపార లావాదేవీలకు మంచి చేస్తుందని అంటున్నారు స్థానికులు. ప్రపంచ దేశాల సుందరీమణులు చార్మినార్ గాజులపై ఆసక్తి చూపడంపై స్థానిక వ్యాపారులకు కూడా కొత్త ఉత్సాహాన్ని ఇచ్చినట్లయింది. దీంతో ఇప్పుడు వివిధ దేశాల పర్యాటకులు కూడా ఈ ప్రాంతానికి రావడానికి ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా హైదరాబాద్ నగరంలో మిస్ వరల్డ్ పోటీలు జరుగుతుండడం.. నగర అభివృద్ధికే కాకుండా తమకు కలిసొచ్చిందని వ్యాపారాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు లాడ్ బజార్ అంటే కేవలం గాజుల మార్కెట్ మాత్రమే కాదు.. గ్లోబల్ గ్లామర్‌కు తెరతీసే అద్దం అవుతుందని, ఇది స్వాగతించదగిన పరిణామం అని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.

# బయటకు అఘోరి రాసలీలలు



హైదరాబాద్, మే 14, : గత కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో లేడీ అఘోరి పేరు మార్మోగిపోతుంది. ఇప్పటికే తాంత్రిక పూజల పేరుతో ఓ మహిళ వద్ద నుంచి భారీగా డబ్బులు వసూలు చేసిన కేసులో జైలులో రిమాండ్‌లో ఉంది. అంతేకాక అఘోరి శ్రీవర్షిణి కన్నా ముందే తనను పెళ్లి చేసుకుందంటూ మొదటి భార్య రాధిక పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. పైగా ఇప్పటికి కూడా అఘోరి ఆడా.. మగా అనే అంశంపై క్లారిటీ రాలేదు. ఇదిలా ఉంటే ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న అఘోరిపై మరో కేసు నమోదయ్యింది. ఈసారి అత్యాచారం కేసు ఫైల్ కావడం గమనార్హం. ఈ కేసు కరీంగ నర్ జిల్లా, కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేశారు. లేడీ అఘోరి రి తనకు బలవంతంగా తాళి కట్టిందని.. అంతేకాక తనపై అత్యాచారం ప్రయత్నం కూడా చేసిందంటూ ఓ యువతి కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సనాతన ధర్మం పేరుతో అఘోరి బాధితురాలితో పరిచయం పెంచుకుంది. ఆ తర్వాత తనను ట్రాప్ చేసి.. ప్రేమించానని మాయ మాటలు చెప్పిందని బాధితురాలు ఆరోపించింది. అంతటితో ఆగక.. తనను బలవంతంగా కొండగట్టు తీసుకెళ్లి మెడలో తాళి కూడా కట్టిందని పోలీసులకు తెలిపింది. ఆపై తనపై అత్యాచారయత్నం చేసేందుకు ప్రయత్నం చేసిందని.. తన ప్రైవేట్ పార్ట్స్‌పై చేతులు వేసిందని బాధితురాలు ఆరోపించింది. అంతటితో ఆగకుండా తనను బెదిరించి రూ. 3 లక్షల రూపాయలు తీసుకుందని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో వెల్లడించింది. ఈ విషయాన్ని బయటపెడితే చంపేస్తానంటూ బెదిరించిందని పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అఘోరీపై 64(1), 87 318(4) 351(2) సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్థిక మోసం కేసులో ఇప్పటికే పోలీసుల రిమాండ్‌లో ఉన్న అఘోరిని ఈ కేసుకు సంబంధించి కూడా విచారించే అవకాశముంది అంటున్నారుహైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ ఇటీవల అఘోరిపై మోకిలా పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తాంత్రిక పూజల పేరుతో తన వద్ద రూ. 9.5 లక్షలు తీసుకొని మోసం చేసినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. దీంతో రంగంలోకి దిగిన మోకీలా పోలీసులు.. అఘోరిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం దీనిపై విచారణ జరుగుతోంది. మరోవైపు అఘోరికి మె?దటి భార్య తానేనంటూ రాధిక అనే మహిళ ఇటీవల మీడియా ముందుకు వచ్చింది. ఇదిలా ఉంటూ.. అఘోరీ.. శ్రీవర్షిణి అనే యువతిని సైతం పెళ్లి చేసుకుంది. అఘోరి లీలలు ఒక్కోటి వెలుగు చూస్తున్నాయి. ఇంకెంతమంది బాధితులు బయటకు వస్తారో చూడాలి మరి అంటున్నారు జనాలు.

# నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి చేసుకోవాలి



**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా**

ప్రజా క్రాంతి, గోదావరిఖని: గోదావరిఖనిలో నిర్వహించే మెగా జాబ్ మేళా ను నిరుద్యోగులు చుట్టుపక్క ప్రాంతం నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా తెలిపారు. బుధవారం నాడు పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించి నిరుద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. నోబెల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్మెంట్ అసోసియేషన్ మరియు సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో రామగుండం ఏరియా1,2,3 ఏరియా పెద్దపల్లి మరియు మంచిర్యాలజిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు కోసం దాదాపుగా 100 పైగా కంపెనీలో, 3000పైచిలుకు ఉద్యోగాల కొరకు మెగా జాబ్ మేళా తేది. 18-05-2025, ఆదివారం రోజున ఉదయం 8:00గంటల నుండి గోదావరిఖనిలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని ఇట్టి అవకాశన్ని నిరుద్యోగ యువత సద్వినియోగించుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ సందర్భంగా రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ జా, ఏసీపి శ్రీ మడత రమేష్, డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాగవేందర్ రావు, ఆర్ జీ. 1 జిఎం లలిత్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి మెగా జాబ్ మేళా పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది.

## కాలేశ్వరం ముక్తేశ్వర దేవస్థానం డైరెక్టర్ గా భూంపల్లి రాజయ్య

కమాన్ పూర్ ప్రజా క్రాంతి మే 14. కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భూపల్లి రాజయ్యను కాలేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థాన డైరెక్టర్ గా నియమించారు. రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమలు అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు శ్రీధర్ బాబు ఆశీస్సులతో కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం డైరెక్టర్ గా కమాన్ పూర్ మండలం కేంద్రానికి చెందిన భూంపల్లి రాజయ్య బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ఎండోమెంట్ సెక్రటరీ శైలజ రామయ్య ఆదేశాల మేరకు కాలేశ్వరం ముక్తేశ్వర దేవస్థానం చైర్మన్ మరియు డైరెక్టర్లను నియమించారు.

కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేసిన బొంపల్లి రాజయ్యకు అవకాశం కల్పించినందుకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్, చింతపండు మధు లల్లు, నగునూరి నరసయ్య మల్యాల మల్లేష్, పెండ్యాల రాజు, చొవ్వరి శేఖర్, సాగి శ్రీధర్ రావు,మంత్రివర్యులు శ్రీధర్ బాబుకు శీను బాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ భూంపల్లి రాజయ్యకు హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుర్ల శ్రీధర్ బాబుకు మరియు శీను బాబులకు భూపతి రాజా ధన్యవాదాలు తెలిపారు.

# చెంప తొలగింపుతో ముగిసిన తిరుపతి తల్లి గంగమ్మతల్లి జాతర

**వారం రోజులుగా వైభవంగా జాతర ఉత్సవాలు...**

**విశ్వరూప దర్శనం చూస్తే సకల సౌభాగ్యం**

తిరుపతి: శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతర వేడుకగా ముగిసాయి. అమ్మవారి చెంప తొలగింపు కార్యక్రమంతో ఎనిమిది రోజుల పాటు వైభవంగా సాగిన జాతర పరిసమాప్తం అయ్యింది. అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని చూసేందుకు రాయలసీమ ప్రాంత ప్రజలు పోటెత్తారు. ఆలయం ముందు బాగంగలో గంగమ్మ బొమ్మ తయారీలో దళితులు, కుమ్మరి, కంసాలి, చాకలి, మంగళి, గొల్ల వంటి మిరాశిదార్లు పాల్గొంటారు. గంగమ్మ బొమ్మకు కావలసినంత బంకమట్టిని పక్కనే ఉన్న కుమ్మరి వాళ్ళు బాగా పిసికి పక్కనున్న ఆచ్చారులకు అందించడం ఆనవాయితీ. అచ్చారులు నీలిమందునూనెను రంగరించి గంగమ్మ ముఖానికి నీలిరంగును అద్దారు. బంగారు పూతపూసిన చేప ఆకారంలో చెక్కబడిన ముక్కెరను అలంకరించారు. బంగారం రంగురేకుల చెవులను గంగమ్మ బొమ్మకు జోడించారు. చెవులకు బంగారంలా మెరి సే సింగపూరు రేకుతో చేయబడిన కమ్మలు, జుంకీలను అలంకరిస్తారుమంగళి వాళ్ళు గంగమ్మ బొమ్మ తలమీదతలవెనుక తెల్ల వెంట్రుకలను దారాల్లాగా పేడి, పొడవుగా వేలాడదీశారు. బంగారంలా ధగధగ మెరిసే సింగపూరు రేకుతోనే చేయబడి నగిషీలు చెక్కబడిన కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. కిరీటం క్రింద మల్లెపూలతోను., కనకంబరాలతోను అలంకరిస్తారు. గంగమ్మ నుదురు భాగమంతా ఎర్రని కుంకుమను పట్టీలా పెట్టారు. నుదురు భాగం మధ్యలో వెండితో చేసిన అడ్డనామాలను అమర్చారు. కనుబొమ్మల మధ్య గంధంతో పెద్ద బొట్టును పెట్టారు. గంగమ్మ బొమ్మ నోరు తెరుచుకొని ఉన్నట్లుగా రూపాని పెట్టారు. నోటినిండా ఎర్రకుంకుమను నింపారు. వెదురు దెబ్బలతో చేసిన పళ్ళను పెట్టారు. చాకలి వాళ్ళు తెచ్చిన చీరను గంగమ్మ బొమ్మకు చుట్టారు. గొల్లవాళ్లే తెచ్చిన మంగళసూత్రాలను గంగమ్మ మెళ్ళో వేశారు. గంగమ్మ చీరకు ఒడిబాలును గొల్లవాళ్లే తెచ్చి పెట్టారు. కొద్దిసేపు బంగారు తాళిబొట్లును గంగమ్మ బొమ్మకు కట్టి తీశారు. కింద వెండితో చేసిన కన్నులను అమర్చుతారు. వెండి కన్నుల మధ్యలో నల్లని కనుగుడ్లు పెట్టడానికి ఖాళీ ప్రదేశం ఉంటుంది. కనుగుడ్లను మాత్రం చివరలో పెడ్తారు. నల్లగుడ్లను పెడితే గంగమ్మ బొమ్మకు ప్రాణం వచ్చినట్లు భావిస్తారు. తెల్లవారు జామున పేరంటాలు తాతయ్య గుంట గంగమ్మ గుడికి పేరంటాలు చేరుకున్నాయి. గుడి ముందున్న గంగమ్మ బొమ్మను చూస్తూనే పేరంటాలు వేషానికి పూనకం వచ్చి చిందులేసిచేటీతో హారతి సమర్పించింది. గంగమ్మ బొమ్మ దగ్గరుండే వారు పేరంటాలు వేషానికి హారతిచ్చిగంగమ్మ పూలహారాన్ని తీసి పేరంటాలు వేషానికి వేస్తారుతర్వాత చుట్టూ ఉన్న జనం, అరుపులు, కేకలు, కిలారింపులు అధికమౌతాయి. పంబలవాడు పంబను వాయిస్తూంటే పేరంటాలు వేషధారి పంబలకు అనుగుణంగా అడుగులేస్తూ, ఆవేశంతో, ఉద్రేకంతో గంగమ్మ బొమ్మ చెంప దగ్గరుండే మట్టిని చేత్తో లాగెసారు. దీన్నే "గంగమ్మ చెంప నరకడం" అంటారు. పేరంటాలు వేషం వెనక్కు వెళ్ళిపోతూ ఎదురుపడ్డ వారికి ఒడిబాలులోని అక్షింతల్ని ఇస్తారు. తిరుపతి గంగ జాతర చాటింపుతో ప్రారంభమై వివిధ వేషాలతో, మొక్కులతో, వినోదాలతో, వ్యాపారాలతో, వివిధ పూజలతో సాగి చిట్ట చివర గంగమ్మ చెంప నరకడంతో పరిసమాప్తం అయింది.

# రామయ్య పాటకు జేజేలు



మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర' నుంచి ఇటీవలే 'రామ రామ..' అంటూ భక్తి భావాలతో కూడిన ఓ గీతాన్ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడీ పాట యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలుస్తున్నది. ఇప్పటికే రెండున్నర కోట్లకుపైగా వ్యూస్ సాధించిన రికార్డు సృష్టిం చింది. అదే విధంగా అన్ని మ్యూజిక్ ఛార్ట్స్‌లో అగ్ర భాగాన కొనసాగు తున్నది. కోదండరాముడి గుణగణాలను కీర్తిస్తూ సాగిన ఈ పాట ప్రేక్షకులందరినీ అలరిస్తున్నది. చిరంజీవి నృత్యరీతులు, కీరవాణి బాణీ, రామజోగయ్య శాస్త్రి చక్కటి సాహిత్యం ఈ పాటలో ప్రధానాక ర్షణలుగా నిలుస్తున్నాయని మేకర్స్‌ఆనందం వ్యక్తంచేశారు. 'బింబి సార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతా కంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ తుదిదశలో ఉంది. దసరా కానుకగా సెప్టెంబర్ చివరి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# సినిమా

## సమంతతో త్రివిక్రమ్ లేడీ ఓరియెంటెడ్ మూవీ?



త్రివిక్రమ్ దర్శకత్వంలో అత్తారింటికి దారేది, సన్నాఫ్ సత్యమూర్తి, అఆ.. చిత్రాల్లో కథానాయికగా నటించారు సమంత. ఈ మూడూ బ్లాక్‌బస్టర్సే. అయితే.. 'అఆ' తర్వాత త్రివిక్రమ్ డైరెక్షన్‌లో సమంత నటించలేదు. తాజా సమాచారం ప్రకారం మళ్లీ వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా రానున్నదని తెలుస్తున్నది.

ఇటీవల ఓ సందర్భంలో సమంత తెలుగు సినిమాల్లో నటించాలని త్రివిక్రమ్ కోరారు. సామ్ కూడా తన 'శుభం' ప్రమోషన్‌లో భాగంగా తెలుగు సినిమాల్లో నటించాలనుందనీ, అయితే.. సరైన కథలు రావడం లేదని, మంచి లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్ వస్తే చేస్తానని చెప్పుకొచ్చింది. అందుకే.. సామ్ కోసం గురూజీ మళ్లీ కలం పట్టారట. ప్రస్తుతం ఆయన వెంకటేశ్‌తో సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. వెంకటేష్ కాల్షీట్లు ఖరారైతే.. ఈ సినిమా పట్టాలెక్కుతుంది. అయితే.. ఈ లోపు సామ్ కోసం గురూజీ ఓ లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్‌ను తయారు చేసే పనిలో ఉన్నారట.

600కోట్ల నిర్మాణ వ్యయంతో అట్లీ తెరకెక్కిస్తున్న బన్నీ ప్రాజెక్ట్ పూర్తవ్వడానికి చాలా సమయం పడుతుంది. ఈ గ్యాప్‌లో.. వెంకీ సినిమాతోపాటు సమంత సినిమాను కూడా పూర్తి చేసేయాలని త్రివిక్రమ్ భావిస్తున్నారని ఫిల్మ్ వర్గాల సమాచారం.

# 'స్పిరిట్' కోసం 20కోట్లు?



అగ్ర కథానాయికలు సాధారణంగా పదికోట్ల లోపే పారితోషికాన్ని అందుకుంటారు. పాన్ ఇండియా ట్రెండ్ వల్ల ఇటీవలి కాలంలో వారి రెమ్యునరేషన్స్‌లో భారీ పెరుగుదల కనిపిస్తున్నది. తాజా సమాచారం ప్రకారం 'స్పిరిట్' సినిమా కోసం బాలీవుడ్ అగ్ర నాయిక దీపికా పడుకోన్‌కు 20కోట్ల పారితోషికాన్ని ఆఫర్ చేశారని ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్నది. ఒకవేళ ఇదే గనుక నిజమైతే ఇప్పటివరకు అత్యధిక పారితోషికం అందుకున్న కథానాయికగా దీపికా రికార్డుల్లోకెక్కడం ఖాయమంటున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' తెరకెక్కనుంది. వచ్చే నెలలో సెట్స్‌మీదికి వెళ్లనుం దని సమాచారం. ఈ సినిమాలో కథానాయికగా మృణాల్ ఠాకూర్, అలియాభట్, రష్మిక మందన్నతో పాటు పలువురు అగ్ర నాయికల పేర్లు వినిపించాయి. అయితే ఇప్పటివరకు అధికారికంగా ఎవరినీ ఖరారు చేయలేదు. తాజాగా దీపికా పడుకోన్ పేరు తెరపైకి వచ్చింది. ఆమె ఈ సినిమా కోసం 20కోట్ల భారీ పారితోషికాన్ని డిమాండ్ చేసిందని, మేకర్స్ కూడా అంతమొత్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని వార్తలొస్తున్నాయి. అయితే ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో ప్రభాస్–దీపికా కలిసి నటించారు. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో అపూర్వ విజయం సాధించింది.

# ఆ హీరోయిన్ దగ్గర జాబ్ చేసే ఛాన్స్.. క్వాలిఫికేషన్స్ ఇవే..!





నిరుద్యోగులకి జాబ్ దొరికింది అంటే ఆ ఆనందమే వేరు. ఇక హీరోయిన్ దగ్గర జాబ్ చేసే ఛాన్స్ వస్తే ఎగిరి గంతేయాల్సిందే. మరి ఆ అవకాశాన్ని ఎందుకు మిస్ చేసుకుంటారు. మల్లేశం సినిమాతోనే మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న అనన్య నాగళ్ల ప్లే బ్యాక్ అనే సినిమాతో సక్సెస్ సాధించింది. ఇక వకీల్ సాబ్ చిత్రంతో అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రతి సినిమతో తన మార్క్ సెట్ చేస్తున్న అనన్య నాగళ్ల సిల్వర్ స్క్రీన్ మీద నటిగా పేరు తెచ్చుకుంది. ఇక సోషల్ మీడియాలో ఫోటో షూట్లతో మెప్పిస్తుంటుంది. ఉన్నత చదువులు అభ్యసించి సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా కెరీర్ ప్రారంభించిన ఈ అమ్మడు సినిమాలపై మక్కువతో ఇండస్ట్రీలోకి వచ్చింది. అయితే మొదట షార్ట్ ఫిల్మ్స్ చేసి ఆ తర్వాత హీరోయిన్‌గా మారింది. అనన్య నాగళ్ల ప్లే బ్యాక్, మ్యాస్ట్రో, ఊర్వశివో రాక్షసివో, శాకుంతలం, తంత్ర, డార్లింగ్, పొట్టేల్, శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్ తదితర సినిమాల్లో హీరోయిన్ గా , సెకెండ్ ఫీమెల్ లీడ్ రోల్స్ నటించి ప్రేక్షకులని మెప్పించింది. మధ్య మధ్యలో వెబ్ సిరీస్‌లు కూడా చేస్తుంది. అయితే అనన్య నాగళ్లకి సేవా భావం చాలా ఉంది. విపత్తు వచ్చినప్పుడు, ఎవరైన ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తన వంతు సాయం చేస్తూ ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో వరదలు సంభవించినప్పుడు తనకు తోచినంత విరాళం అందించింది. అలానే హైదరాబాద్ నగరంలో రాత్రిళ్లు రోడ్లపైనే నిద్రించే పేదలు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేసి అందరి మనసులు గెలుచుకుంది. ఇక పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన నెల్లూరు జిల్లాకు చెందిన మధు సూదన రావు కుటుంబాన్ని పరామర్శించింది అనన్య. తనకు తోచినంత సాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్న ఈ ముద్దుగుమ్మ తాజాగా ఇన్ స్టా స్టోరీస్ లో ఒక పోస్ట్ షేర్ చేసింది. ' ఫ్యాషన్ డిజైనర్ కోసం వెతుకుతున్నాను. 0–6 సంవత్సరాల అనుభవం ఉన్నవారు ఎవరైన సరే.. దయచేసి మీ రెజ్యూమ్‌ను  కు పంపండి. దయచేసి చేయవద్దు' అని అందులో పేర్కొంది. మొత్తానికి అనన్య ఫ్యాషన్ డిజైనర్స్‌కి బంపర్ ఆఫర్ ఇచ్చింది. ఈ అవకాశాన్ని మిస్ చేసుకోకండి మరి.

# లండన్‌లో రామ్‌చరణ్‌ను కలిసిన ప్రఖ్యాత బాక్సర్



ప్రముఖ నటుడు రామ్ చరణ్‌ను లండన్‌లో ప్రముఖ బాక్సర్ జూలియన్ ఫ్రాన్సిస్ కలిశారు. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న రామ్ చరణ్ మైనపు విగ్రహాన్ని అక్కడి ప్రఖ్యాత మేడమ్ టూస్సాడ్స్‌లో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి రామ్‌చరణ్ కుటుంబ సమేతంగా లండన్‌కు వెళ్లారు.

ఈ క్రమంలో బ్రిటిష్ హెవీ వెయిట్ ఛాంపియన్‌గా ఐదుసార్లు, కామన్వెల్త్ ఛాంపియన్‌గా నాలుగుసార్లు గెలిచిన బాక్సర్ జూలియస్ ఫ్రాన్సిస్ మంగళవారం రామ్ చరణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా బాక్సింగ్ బెల్ట్‌ను తన భుజంపై వేయమని రామ్ చరణ్‌ను జూలియస్ కోరారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో రామ్ చరణ్ మైనపు విగ్రహాన్ని స్వయంగా చరణ్ చేతుల మీదుగా ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో చరణ్ సతీమణి ఉపాసన, కుమార్తె క్లీంకార, తల్లిదండ్రులు చిరంజీవి, సురేఖ పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.




Printed,PublishedandOwnedbyJADAVROHIDAS, PrintedatJADAVROHIDAS ,Associate printers,Padmanagar,Asifabad,Dist,Telangana-500001Publishedat,JANANINADAM,H..NO.12-27,Village;Fatkal , Mangi,Mandal;Lingapur,Dist:komaramBheem
(Asifabad),State Telangana-505001,Editor:JADAV ROHIDAS RNI No.TELTEL/2023/12314,Cell:9550100197,9490111460.